# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 8 ఆగస్టు 2025 | సంపుటి:9 | సంచిక:222 | పేజీలు:8+4 | వెల: రూ.5


GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


**ఎల్ఐసీకి రూ.10,987 కోట్ల లాభం**




2

**అణుదాడిని గుర్తు చేసుకున్న జపాన్**



2

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక చేనేతలు

## అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తా

వ్యవసాయం తర్వాత అధికంగా ఉపాధి కల్పించేది వ పరిశ్రమ

మంగళగిరిలో 11వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు

నేత కళాకారులకు అండగా నిలుస్తామన్న లోకేశ్




మంగళగిరి, (మనం న్యూస్): భారతీయ శక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక చేనేతలు అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు- చేసిన 11వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. నైపుణ్యం, సృజనాత్మకత కలయిక చేనేతలని, తెలుగుదేశం పార్టీకి నేతన్నలకు అవినాభావ సంబంధం ఉందన్నారు. నేతన్నలకు ఉపాధి కల్పించిన నేత ఎన్టీఆర్. వ్యవసాయం తర్వాత అధికంగా ఉపాధి కల్పించేది వ పరిశ్రమ అన్నారు. 55,500 మంది చేనేత కార్మికులకు రూ.2లక్షలు చొప్పున రూ.27కోట్లు- రుణాలు ఇచ్చాం. 90,765 కుటు-ంబాలకు 100 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇచ్చాం అన్నారు. చేనేత కార్మికులకు తొలిసారిగా 50ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని నిర్ణయించాం. చిన్న వయసులోనే అనారోగ్యం పాలవుతున్న పరిస్థితి.. అందుకే 50 ఏళ్లకే పింఛన్ తీసుకొచ్చాం అన్నారు. 50శాతం సబ్సిడీతో మర మగ్గాలకు రూ.80కోట్లు- ఖర్చు పెట్టాం. ఈ నెల నుంచే 200యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని హామీ ఇస్తున్నాం. మరమగ్గాలకు



500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తాం. ఉచిత విద్యుత్ వల్ల 93 వేల కుటుంబాలకు లబ్ధి కలుగుతుంది. చేనేతలకు ఎంత ఇచ్చినా తక్కువే అవుతుందని చంద్రబాబు అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి ఆటోనగర్ లోని వీవర్ శాల వద్ద నిర్వహించిన 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబుతో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా వీవర్ శాలలో ఏర్పాటు-చేసిన చేనేత ఉత్పత్తుల స్టాళ్లను, వీవర్ శాలలో మగ్గాలు, చేనేత వస్త్రాలను మంత్రి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు-చేసిన సభలో 'జై చేనేత' అంటూ మంత్రి నారా లోకేష్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మంగళగిరి నియోజకవర్గంలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా. అందరూ చేనేతలను కార్మికులని అంటారు. కానీ చేనేత కార్మికులు పడుతున్న కష్టాలు నేను నేరుగా చూశాను. దారానికి రంగు దగ్గర నుంచి మగ్గాలపై చీర నేసే వరకు అహర్నిశలు శ్రమిస్తారు. అద్భుతమైన డిజైన్స్ రూపొందిస్తారు. అందుకే నేతన్నలందరినీ నేను చేనేత కళాకారులని ఈ సందర్భంగా పిలుస్తున్నాను. 2019లో 21 రోజుల ముందు టీడీపీ అభ్యర్థిగా

...మిగతా 2లో

### చేనేతలకు పెద్దపీట వేసిన చంద్రబాబు

హామీ మేరకు మరమగ్గాలకు ఉచిత విద్యుత్

మంగళగిరి సభలో మంత్రి సవిత

2

## కళాకారుల సృజనాత్మకతకు ఆలంబన..చేనేత

చేనేత కళాకారులకు ఊతమిచ్చేలా నిర్ణయాలు

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



చేనేత... మన దేశ సంస్కృతికి, స్వాతంత్ర్య ఉద్యమ భావనలకు, మన కళాకారుల సృజనాత్మకతకు ఆలంబనగా నిలిచిందని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాన్ అన్నారు. నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. మన దేశంలో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే అసంఘటిత రంగాలలో చేనేత ఒకటి. ఈ రంగానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఊతమిస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో చేనేత రంగానికి లబ్ధి చేకూరేలా నిర్ణయాలు తీసుకున్నాము. నేత మగ్గాలకు 200 యూనిట్లు-, మర మగ్గాలకు

...మిగతా 2లో

## పేదలకు మెరుగైన వైద్యం

వేలకోట్లు ఖర్చుచేస్తున్నాం

చెక్కుల పంపిణీలో మంత్రి పార్థసారథి

నూజివీడు, (మనం న్యూస్): పేదల మెరుగైన వైద్యం కోసరం ప్రభుత్వం వేలకోట్లు కేటాయించిందని, అపత్కాలంలో ఉన్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి, అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో పట్టణానికి చెందిన ఏడు కుటుంబాలకు గాను, రూ,6,08,832లక్షలు,నూజివీడు మండలంలో 9 మందికి గాను, రూ,3,87,505.లక్షల,



ఆగిరిపల్లి మండలంలో 12 మంది బాధిత కుటు-ంబాలకు,

...మిగతా 2లో

## ఇలా చేస్తే 20 శాతం రాయితీతో పాటు మరిన్ని వెసులుబాట్లు..!

విజయవాడ,(మనం న్యూస్): విజయవాడలో జరిగిన గ్రీన్ ఆంధ్రా సమ్మిట్ 2025కు హాజరైన మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు.. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నోవాటెల్‌లో ఒకరోజు సదస్సు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. సర్టిఫికేషన్ ఉండే భవనాలకు మరిన్ని రాయితీలు ప్రకటించారు.. అమరావతిలో నిర్మాణాలన్నీ గ్రీన్ హౌస్ భవనాలుగా నిర్మిస్తున్నాం.. గ్రీన్ బిల్డింగ్స్ కు పర్మిట్ ఫీజులో 20 శాతం రాయితీతో పాటు డెవలప్‌మెంట్ చార్జీలు నాలుగు వాయిదాల్లో చెల్లించేలా ఇప్పటికే అవకాశం ఇచ్చాం అని వెల్లడించారు.. గ్రీన్ హౌస్ భవనాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలనే ఉద్దేశంతో మరికొన్ని రాయితీలు ప్రకటిస్తారు.. ఇచ్చే సర్టిఫికేషన్ ఆధారంగా సిల్వర్ బిల్డింగ్‌కు 10 శాతం, గోల్డ్ బిల్డింగ్ కు 15 శాతం, ప్లాటినం బిల్డింగ్‌కు 20 శాతం ఇంపాక్ట్ ఫీజులో డిస్కౌంట్ ఇస్తాం అని తెలిపారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రీన్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.. ఏపీని డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం అన్నారు మంత్రి నారాయణ.




## 2047 లక్ష్యాలకు దెబ్బ

ట్రంప్ సుంకాల ప్రభావంపై దువ్వూరి సుబ్బారావు

హైదరాబాద్, ఆగస్టు 7: ట్రంప్ సుంకాల ప్రభావం ఇప్పటికిప్పుడు ఉండకున్నా.. మధ్యస్థ, దీర్ఘకాలంలో మాత్రం అధిక ప్రభావం చూపుతుందని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్, ఆర్థిక వేత్త దువ్వూరి సుబ్బారావు తెలిపారు. భారత్‌పై మరో 25 శాతం సుంకాన్ని విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ అంశంపై ఆయన ఒక ఇంగ్లీషు మీడియాతో మాట్లాడారు. భారత జీడీపీలో ఎగుమతుల వాటా 22 శాతంగా ఉంది. మొత్తం ఎగుమతుల్లో అమెరికా

...మిగతా 2లో

## కొన్ని అగ్ర దేశాల బెదిరింపులకు మనం భయపడేది లేదు

భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు



కష్ణా, (మనం న్యూస్): ప్రపంచ ఆర్థిక అభివృద్ధిలో భారతదేశం నాలుగో స్థానంలో ఉందని.. త్వరలోనే మూడో స్థానానికి చేరుతుందని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఉద్ఘాటించారు. చదువుతో పాటు డిగ్రీ సంపాదించడమే కాదని.. సంస్కారం, విజ్ఞానం సంపాదించడం ముఖ్యమని వ్యాఖ్యానించారు. భావితరాలు ఈ అంశాలను గుర్తుపెట్టుకోవాలని దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు సంస్కారంతో ఉండేలా అలవాటు చేయాలని సూచించారు. విద్యాలయం, గ్రంథాలయం, సేవాలయం ఉండేలా చూడాలని ఆకాంక్షించారు వెంకయ్య నాయుడు. కష్ణా జిల్లాలోని ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుంకర రామబ్రహ్మం, సుంకర అనిల్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికేట్‌లను వెంకయ్య నాయుడు

...మిగతా 2లో

## ముదరిన శాతవాహన కాలేజీ వ్యవహారం

ఎమ్మెల్సీ ఆలపాటి బెదిరిస్తున్నారని ప్రిన్సిపాల్ ఫిర్యాదు

తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్న ఆలపాటి



విజయవాడ, (మనం న్యూస్): విజయవాడలో శాతవాహన కళాశాల వివాదం వ్యవహారం మరో మలుపు తిరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్ తనకు టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో ప్రాణహాణి ఉందని తనను ఆలపాటి బెదిరిస్తున్నారని రక్షణ కల్పించాలని విజయవాడ పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. తాజా పరిణామాలపై స్పందించిన టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్.. కీలక వ్యాఖ్యలు చేశారు.. శాతవాహన కాలేజీ ప్రారంభించి 53 యేళ్లు అయ్యింది.. అనేకమంది పెద్దలు సెక్రటరీ లుగా పని చేశారు.. 2011లో నేను సెక్రటరీగా అయిన సమయంలో ఈ ఆస్తిని లోక్ అదాలత్‌లో

...మిగతా 2లో

ఎన్నికల సంఘంపై ఆరోపణలు..

## రాహుల్ గాంధీకి పరిపక్వత లేదు: పీవీఎన్ మాధవ్

ఒంగోలు: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పూర్తి నిరాధారమని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విమర్శించారు. రాహుల్ ఆరోపణలు పరిపక్వత లేని విధంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఒంగోలులో మీడియాతో మాధవ్ మాట్లాడారు.'' రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కర్ణాటక ఎన్నికల సంఘం స్పందించి ఆధారాలు

...మిగతా 2లో

### ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

నామినేషన్లకు 21 చివరితేదీ.. 25న ఉపసంహరణ

సెప్టెంబర్ 9న రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నిక

2

## భారత్‌కు రానున్న పుతిన్

ఏడాది ఆఖర్లో వచ్చే అవకాశం

మాస్కో, ఆగస్టు 7: రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. ఆయన పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ వెల్లడించారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న డొభాల్.. రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షొయిగుతో సమావేశమైన అనంతరం ఈ ప్రకటన చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నేపథ్యంలో భారత్ పై అమెరికా అధ్యక్షుడు

...మిగతా 2లో

## 20వేల డాలర్లకో గ్రీన్ కార్డ్

అమెరికాలో ఉండాలనుకునే ఆశావహులకు స్పెషల్ ఆఫర్



న్యూయార్క్, ఆగస్టు 7: అమెరికాలో శాశ్వత నివాసం కోసం జారీ చేసే గ్రీన్ కార్డు కోసం భారత్ సహా చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ దేశస్థులు ఏళ్లతరబడి నిరీక్షించాల్సి వస్తుంది. దానికి చెక్ పెడుతూ సరికొత్త షార్ట్ కట్ రూట్ లభించబోతున్నది. గ్రీన్ కార్డ్ కోసం 10 ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్నవారు 20 వేల డాలర్లు (మన కరెన్సీలో దాదాపు రూ.17.5 లక్షలు) చెల్లిస్తే త్వరగా వారి దరఖాస్తును పరిశీలించే అవకాశాన్ని పరిశీలిస్తామన్న అంశంతో కూడిన ఒక బిల్లును అగ్రరాజ్య సర్కార్ ప్రతిపాదించింది.డిగ్నిటీ యాక్ట్ ఆఫ్ 2025 పేరిట ఆ బిల్లును తీసుకువచ్చారు. ''దశాబ్దాలుగా

...మిగతా 2లో

## మా బ్యూరోక్రాట్లు విదేశాలకు పరారైతున్నరు



ఇక్కడ అవినీతితో సంపాదించిన డబ్బుతో అక్కడ ఎంజాయ్ చేస్తున్నరు

వెల్లడించిన పాకిస్తాన్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్

ఇస్లామాబాద్, ఆగస్టు 7: పాకిస్తాన్ ఉన్నతాధికారులపై ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశానికి చెందిన బ్యూరోక్రాట్లు భారీ అవినీతి, మనీలాండరింగ్ కు పాల్పడుతున్నారని ఆరోపించారు. సగం మంది బ్యూరోక్రాట్లు అక్రమంగా సంపాదించిన కోట్లాది రూపాయల నల్లధనాన్ని పాక్ నుంచి పోర్చుగల్‌కు తరలించి, అక్కడ ఆస్తులు కొనుగోలు చేశారని అన్నారు. 'మా దేశానికి చెందిన సగం మందికిపైగా బ్యూరోక్రాట్లు పోర్చుగల్ లో ఆస్తులు కొన్నారు. ఇప్పుడు పౌరసత్వం కోసం ప్రయత్నిస్తున్నారు. వీరంతా ఎంతో పేరున్న ఉన్నతాధికారులు. వందల కోట్ల రూపాయలను మింగేస్తూ, పదవీ విరమణ తర్వాత సుఖమయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు' అని ఖవాజా చెప్పారు. ఓ మాజీ సీఎంకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఓ సీనియర్ అధికారి

...మిగతా 2లో

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక చేనేతలు

(మొదటి పేజీ తరువాయి)

మీ ముందుకు వచ్చా. 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. కానీ మంగళగిరి పట్టణం నాకు ఆనాడు 7వేల మెజార్టీ ఇచ్చింది. ఆనాడే నిర్ణయించాను.. చేనేత సోదరులు నా సొంత కుటుంబ సభ్యులని. ఓడిపోయిన మొదటి రోజు బాధ, ఆవేదన కలిగింది. రెండో రోజు నుంచి ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఐదేళ్లు ఇక్కడే పనిచేసి ప్రజలకు దగ్గర కావాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. మంగళగిరిలో పద్మశాలీ సోదరులకు రెండు కులవృత్తులు ఉంటాయి. ఒకటి చేనేత, రెండోది స్వర్ణకార వృత్తి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేనేత సోదరులను ప్రోత్సహించేందుకు 873 రాట్నాలు ఆనాడు ఉచితంగా అందించాం. కరోనా సమయంలో చేనేతలకు కావాల్సిన మందులు, ఆక్సిజన్ సిలిండర్లు అందించాం. చేనేతల

ఇబ్బందులు స్వయంగా చూసి వీవర్ శాల ఏర్పాటు-చేయడం జరిగింది. ఈ రోజు డిజైన్ ల దగ్గర నుంచి ఆధునిక మగ్గాలు, టాటా తనేరా సంస్థతో ఒప్పందం, మార్కెట్ లింకేజీ చేసి చేనేత సోదరులకు ఆదాయం 30 శాతం పెంచాం. కానీ నేను ఆనందంగా లేను. వారి ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. స్వర్ణకారుల కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లక్ష్మీ నరసింహ స్వర్ణకారుల సంక్షేమం సంఘం ఏర్పాటు-చేశాం. వారికి ఆరోగ్య బీమా, మెరుగైన పనిముట్లు-, ఆర్థికసాయం అందజేయడం జరిగింది.

యువగళం పాదయాత్రలో ప్రొద్దుటూరు, ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడలో నేను చేనేతలను నేరుగా కలుసుకున్నా. వారు పడుతున్న ఇబ్బందులు చూశా. చేనేత సోదరులను దత్తత తీసుకుంటు-న్నానని ఆనాడు చెప్పా. కొంతమంది ఎగతాళి చేశారు. కానీ నా ఆలోచన ఒక్కటే. చేనేత రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలి, వారి ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో నేను దత్తత తీసుకుంటానని ఆనాడు చెప్పా. ప్రభుత్వ పథకాలతో పాటు- డిజైన్లు, మోడరన్ కలర్స్, స్కిల్లింగ్, మార్కెట్ లింకేజీ, ప్రమోషన్.. ఇవన్నీ చాలా అవసరం. అందుకే నేను మంగళగిరి చేనేత కళాకారుల వస్త్రాలను పెద్దఎత్తున ప్రమోట్ చేస్తున్నాం. కుటు-ంబపరంగా మేం పెళ్లికి వెళితే అక్కడ మేం ఇచ్చే చీర కూడా మంగళగిరి చేనేత చీరనే. నేను ప్రధాని, ఇతర రాష్ట్ర, జాతీయ నేతలను కలిసినప్పుడు ఇచ్చేది మంగళగిరి చేనేత శాలువానే. బ్రాహ్మణి మంగళగిరి చేనేత చీర కట్టిన తర్వాత చాలా వైరల్ అయింది. ఒకే ఒక్క షాపులో, అదే రంగు చీర 98 మంది కొనుగోలు చేశారు. మంగళగిరిని మా గుండెల్లో పెట్టుకున్నాం. నేను యువగళంలో చేనేత సోదరులకు కొన్ని హామీలు ఇచ్చా. ఇంట్లో మగ్గాలు ఉంటే 200 యూనిట్లు- విద్యుత్ ఉచితంగా ఇస్తామని చెప్పా. మరమగ్గాలు ఉంటే 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చా. కేంద్రం ఒప్పుకోకపోతే చేనేత వస్త్రాలపై జీఎస్టీ రిబేట్ ఇస్తామని చెప్పా. త్రిఫ్ట్ ఫండ్ తిరిగి ఏర్పాటు-చేస్తామని చెప్పా. చేనేత భరోసా కింద ప్రతి చేనేతకు ఏడాదికి రూ.25వేలు ఆర్థిక సాయం అందిస్తామని ఆనాడు హామీ ఇవ్వడం జరిగింది. స్వర్ణకారులకు ఎప్పుడూ లేనివిధంగా కార్పోరేషన్ ఏర్పాటు-చేస్తామని చెప్పడం జరిగింది. గౌరవ సీఎం సహకారంతో ఇచ్చిన ప్రతిహామీ ఈ రోజు మేం నిలబెట్టుకున్నామని చేనేత సోదరులకు తెలియజేస్తున్నానని లోకేశ్ వివరించారు. ఇప్పుడు మంగళగిరిలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. రాష్ట్రం మొత్తం డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తుండగా మంగళగిరిలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. కేంద్రంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు , మంగళగిరి గల్లీల్లో మీ లోకేష్ అన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత ఇంటి పట్టాలు అందజేశాం. మంగళగిరి దయ వల్ల రాష్ట్రం మొత్తానికి ఒక జోవో వచ్చింది. మొదటి విడతలో వెయ్యి కోట్ల విలువైన భూమిని 3వేల కుటుంబాలకు గౌరవంగా బట్టలు, పసుపు, కుంకుమ పెట్టి పట్టాలు అందించాం. లబ్ధిదారుల నుంచి ఒక్క గ్లాస్ నీరు కూడా తాగలేదు. చంద్రబాబు సహకారంతో 31 కమ్యూనిటీ- హాల్స్ నిర్మిస్తున్నాం. పీఎం సూర్యఘర్ కింద ఇప్పటికే వెయ్యి కనెక్షన్లు ఏర్పాటు-చేశాం. 20 వేల లక్ష్యాన్ని త్వరలోనే చేరుకుని చంద్రబాబు గారికి కానుకగా అందిస్తాం. మోడల్ లైబ్రరీ పనులు జరుగుతున్నాయి. మంగళగిరి-తెనాలి రోడ్డు నిర్మించాం. నాలుగు లేన్ల రోడ్ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తాం. మంగళగిరి పట్టణంలో మహాప్రస్థానం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 100 స్మశానాలు అభివృద్ధి చేస్తున్నాం. విద్యాశాఖ మంత్రిగా నిడమర్రు ప్రభుత్వ పాఠశాలను లీప్ స్కూల్ గా అభివృద్ధి చేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా తయారుచేస్తున్నాం. 46 పార్కులు, స్మార్ట్ బస్ షెల్టర్స్, తాడేపల్లి వంతెన, వంద పడకల ఆసుపత్రి, తాడేపల్లి ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్, మోడల్ ఫిష్ మార్కెట్, మోడల్

రైతు బజార్, భూగర్భ డ్రైనేజ్, వాటర్, పవర్, గ్యాస్ ప్రాజెక్ట్, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, నిడమర్రు రైల్వేగేట్ దగ్గర బ్రిడ్జ్, ఎయిమ్స్, మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి చేస్తున్నాం అన్నారు. ఇలా 200 అభివృద్ధి కార్యక్రమాలు ఒక్క మంగళగిరి నియోజకవర్గంలో మీ ఆశీస్సులతో చేపట్టడం జరిగింది. మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న మా పద్మశాలీ నాయకులకు మీరు రాష్ట్రస్థాయి గుర్తింపు అందించారు. నందం అబద్దయ్య గారిని పద్మశాలీ కార్పోరేషన్ ఛైర్మన్ గా, తమ్మిశెట్టి జానకమ్మ గారిని టీటీడీ బోర్డు మెంబర్‌గా, చిల్లపల్లి శ్రీనివాసరావు గారిని ఏపీఎస్ఎంఐడీసీ ఛైర్మన్ గా నియమించాం. కందుల నాగార్జునను పద్మశాలీ కార్పోరేషన్ డైరెక్టర్ గా నియమించాం. ఇది ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని పద్మశాలీలకు తెలియజేస్తున్నానని అన్నారు. చేనేత సంక్షేమం కోసం అహర్నిశలు పోరాడింది ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని గౌరవ సీఎం గారిని కోరుతున్నా. అంతేకాకుండా టిడ్కో హౌసింగ్ లో 6 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న పార్క్ కు ప్రగడ కోటయ్య గారి పేరు పెట్టాలని నిర్ణయించాం. ఆ పార్క్ లో ప్రగడ కోటయ్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు-చేస్తున్నామని తెలిపారు. అనంతరం మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శ్రీకాకుళం నుంచి మొదలుకుని పొందూరు ఖద్దరు, ఉప్పాడ, మంగళగిరి, వెంకటగిరి వంటి ప్రాంతాల నుంచి పట్టు, నూలు దారాలతో తయారుచేసిన ఏపీ చిత్రపటాన్ని సీఎం చంద్రబాబు కి అందజేశారు.

## చేనేతలకు పెద్దపీట వేసిన చంద్రబాబు

మంగళగిరి, (మనం న్యూస్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేతలకు పెద్దపీట వేయటంతో 2014-2019 కాలంలో చేనేతలకు స్వర్ణయుగంగా గడించిందని మంత్రి సవిత అన్నారు. నందమూరి తారక రామారావు నుంచే చేనేతలను తెలుగు దేశం పార్టీ అక్కున చేర్చుకుందన్నారు. కానీ 2019-2024 మధ్యలో గత ప్రభుత్వం చేనేతల సంక్షేమానని పట్టించుకోకుండా రోడ్డున పడవేయటంతో చాలా సమస్యలు ఎదుర్కోన్నారని, చాలా మంది అత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో నారా చంద్రబాబు నాయుడు, యువ నేత నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఎర్పడిన వెంటనే చేనేతలను అక్కున చేర్చుకున్నారన్నారు. చేనేతల కుటుంబాలు ఎంతో కష్ట జీవులని, నూలు పోగులకు వస్త్రాలుగా తయారు చేసి మనుషుల మానాన్ని కాపాడుతున్నారన్నారని వారికి అవసరమైన అన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ నిరంతరం సూచనలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు చేనేతలకు మగ్గాలు ఉన్న వారికి 200 యూనిట్లు-, మరమగ్గాలు ఉన్నవారికి 500 యూనిట్లు- ఉచిత విద్యుత్ ను అమలు చేయటం జరుగుతుందన్నారు. దీని వలన మగ్గాలు ఉన్న వారకి సంవత్సరానికి రూ.15,000 వరకు, మరమగ్గాలు ఉన్న వారికి రూ.30,000 వరకు ప్రభుత్వం అసరా అందింస్తుందన్నారు. చేనేత వస్త్రాలకు

మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాల కోసం ప్రతి నెల ఎగ్జిబిషన్లు, కార్పోరేట్ సంస్థలతో ఎంవోయులు ఏర్పాటు- చేస్తున్నామని, నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలు, చేనేత క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాల ద్వారాను చేనేత కుటుంబాలు లబ్ధి పొందుతున్నా యన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం రోజు కేవలం ఒక వృత్తి ని మాత్రమే కాదు- మన సంస్కృతిని, మన సంప్రదాయాన్ని, గౌరవించుకుంటున్నామన్నారు. నూలు పోగు ద్వారా మనిషి ఆత్మ గౌరవాన్ని పెంచి, శతాబ్దాలుగా మనిషికి నాగరికత ను నేర్పిన మన నేతన్నలను గౌరవనిచ్చుకునే గొప్ప అవకాశం ఇది అన్నారు . 1905 లో స్వతంత్ర ఉద్యమం లో భాగంగా జరిగిన స్వదేశీ ఉద్యమం జ్ఞాపకార్థంగా మనం ఇవాళ జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటు-న్నామన్నారు. చేనేత వృత్తి మన పూర్వీకుల నుండి మనకు లభించిన గొప్ప వారసత్వ సంపద అని ముఖ్యంగా గుంటూరు జిల్లాలో మొత్తం 3200 చేనేత కార్మికులు ఉన్నారని, ఇందులో 2460 మంది మంగళగిరి నియోజకవర్గంలో ఉన్నారన్నారు. మన మంగళగిరిలో తయారయ్యే చీరలు, జరీ చీరలు, బెడ్ షీట్ లు, ధోతిలు, లుంగీ లు వంటి ఎన్నో వస్త్రాలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని, మంగళగిరి చీరలకు జీఐ ట్యాగ్ కూడా లభించిందని, ఇది మన నేతన్నలకు దేశం ఇచ్చిన గౌరవం అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం 2023 లో ఒన్ డిస్ట్రిక్ ఒన్ ప్రొడక్ట్ కింద ప్రత్యేక పురస్కారం కూడా లభించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ4 - జీరో ప్రావర్టీ కార్యక్రమం లో భాగంగా మంగళగిరి నియోజకవర్గం లో దాదాపు 1330 చేనేత బంగారు కుటు-ంబాలు గా దత్తత తీసుకోవటం జరిగిందన్నారు. వారికి విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఉపాధి అవకాశాలు అందించటానికి మార్గదర్శులు ముందుకొచ్చారని, ఈ కార్యక్రమం కేవలం పేదరిక నిర్మూలనకు మాత్రమే కాకుండా ప్రతి మనిషి, ముఖ్యంగా మన నేతన్నలు ఆత్మ గౌరవం తో, ఆత్మ నిర్భరతతో జీవించేందుకు ఉపయోగపడే కార్యక్రమం అన్నారు. మన ముఖ్యమంత్రి గారి నాయకత్వం లో అందరి సహకారంతో చేనేత పరిశ్రమను ఇంకా బలోపేతం చెయ్యాలని, ప్రతి నేతన్న కుటుంబం బంగారు కుటుంబంలా అభివృద్ధి చెందాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నామన్నారు. జాతీయ చేనేత దినోత్సవానికి మంగళగిరికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు రాష్ట్ర ఉన్నత విద్య, ఐటీ- మరియు ఆర్టీజీఎస్ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత, చేనేత మరియు జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, గుంటూరు రేంజీ డీఐజీ సర్వశ్రేష్టి త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, శాసనమండలి సభ్యులు పంచుమూర్తి అనురాధ, జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ్, చేనేత మరియు జౌళి శాఖ సలహాదారు సుచిత్ర ఎల్లా ,రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం ఛైర్మన్ నందనం అబద్ధయ్య స్వాగతం పలికారు. వీవర్ శాల వద్ద ఏర్పాటు- చేసిన చేనేత స్టాల్స్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించి, వీవర్ శాలలో చేనేత కార్మికులతో ముఖాముఖి గా సమావేశం అయ్యారు.

## కళాకారుల సృజనాత్మకతకు ఆలంబన..చేనేత

(మొదటి పేజీ తరువాయి)

500 యూనిట్లు- వరకూ ఉచిత విద్యుత్తు అందిస్తుంది. సొసైటీలనుచి ఆప్కో కొనేవాటికి జీఎస్టీపై 5శాతంరాయితీ అమలు చేయడంతోపాటు- త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు-కు నిర్ణయం తీసుకోవడమైందని అన్నారు. ?చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటు-ంది. చేనేత వస్త్రాలు వినియోగం పెంచే దిశగా ప్రచార కార్యక్రమాలు పెంపొందిస్తాము. యువత వారానికి ఒకసారి చేనేత వస్త్రాలను ధరిస్తే ఆ రంగంపై ఆధారపడ్డవారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పవన్ సూచించారు.

## రాహుల్ గాంధీకి పరిపక్వత లేదు: పీవీఎన్ మాధవ్

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించాలని కోరింది. లేదంటే ఆ వ్యాఖ్యలను ఉపసంహకరించుకోవాలని కోరినా ఆయన స్పందించలేదు. ఇదే ఆయనలో పరిపక్వత లేదని చెప్పేందుకు ఉదాహరణ. రాహుల్‌కు ప్రజలు ప్రతిపక్ష దా కల్పిస్తే న్యాయం చేయలేకపోతున్నారు. రాష్టవ్యాప్తంగా రైతుల సమస్యలపై దష్టి సారిస్తాం. పొగాకు నుంచి ఆక్వా వరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కషి చేస్తుంది'' అని పీవీఎన్ మాధవ్ అన్నారు.

## భారత్‌కు రానున్న పుతిన్

(మొదటి పేజీ తరువాయి)

డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన వేళ ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది చివర్లో పుతిన్ భారత్‌కు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దండయాత్ర అనంతరం ఆయన భారత్ కు రావడం ఇదే మొదటిసారి అవుతుంది.

## కొన్ని అగ్ర దేశాల బెదిరింపులకు మనం భయపడేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు ప్రసంగించారు. కళాశాలలు, యూనివర్శిటీలకు వెళ్లి ప్రసంగించే కార్యక్రవాలను తాను పెట్టుకున్నానని చెప్పుకొచ్చారు. తాను పదవీ విరమణ చేశానే కానీ.. పెదవీ విరమణ చేయలేదని సరదాగా వ్యాఖ్యానించారు. ఉషారామ విద్యార్థులు అంటే ఎక్కడికి వెళ్లినా గొప్పగా చెప్పుకోవాలని మార్గనిర్దేశం చేశారు.16 ఏళ్లుగా ఉషారావు ఇంజనీరింగ్ కళాశాలలో మంచి విద్యను బోధిస్తున్నారని ప్రశంసించారు వెంకయ్య నాయుడు.దేశ భవిష్యత్తు గురించి నేటి తరానికి చెప్పాలనేదే తన సంకల్పమని పేర్కొన్నారు. డిగ్రీ పట్టాలు అందుకున్న ఈరోజు జీవితంలో మరచిపోలేని రోజని నొక్కిచెప్పారు. ప్రపంచంలో నేడు మన దేశం వేగవంతంగా అభివద్ధి చెందుతోందని చెప్పుకొచ్చారు. కొన్ని అగ్రదేశాల బెదిరింపులకు మనం భయపడేది లేదని హెచ్చరించారు. మన పంచభూతాలను మనం గౌరవిస్తే.. అవి మనల్ని కాపాడతాయని ఉద్ఘాటించారు. మన తెలివిని దోచుకుని.. వారి గురించి గొప్పగా బ్రిటిష్ వారు చెప్పుకున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత మన తెలివి తేటలతో మనం సొంతంగా ఎదిగామని నొక్కిచెప్పారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో మనం అమత కాలంలో ఉన్నామని గుర్తుచేసుకున్నారు వెంకయ్య నాయుడు. నేటి తరం అంతా మన దేశ అభివద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. భారతదేశం ఎప్పుడూ ఏ దేశం మీద దండయాత్ర చేయలేదని స్పష్టం చేశారు. మన మూలాలు దెబ్బ తీయడానికే గతంలో చాలా కుట్రలు చేశారని విమర్శించారు. మన సంస్కతిని నిర్వీర్యం చేయాలని చూశారని ధ్వజమెత్తారు. వాటిని మనం తట్టుకుని, నిలదొక్కుకుని నేడు నిలబడ్డామని ఉద్ఘాటించారు. నేడు మనకు ఎన్ని అవకాశాలు ఉన్నాయో... అన్ని సవాళ్లు కూడా ఎదురవుతున్నాయని వెల్లడించారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు ఐక్యతతో ఉండేలా చూడాలని సూచించారు. కుల, మత, ప్రాంత బేధాలు ఉండకూడదని కోరారు. కన్నతల్లిని, పుట్టిన ఊరుని, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదని సూచించారు. ఎంత ఉన్నత స్థానానికి వెళ్లినా నీ ఊరును మరచిపోకుడదని మార్గ నిర్దేశం చేశారు వెంకయ్య నాయుడు. నీకంటే ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారిని చేతనైనంతలో చేయూతను ఇవ్వాలని వెంకయ్య నాయుడు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉన్న సవాళ్లను ఎదుర్కొనేలా మీ మేథస్సుతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు.



## మా బ్యూరోక్రాట్లు విదేశాలకు పరారైతున్నరు

(మొదటి పేజీ తరువాయి)

అవినీతిని రక్షణ మంత్రి ఉదహరించారు. ఆ అధికారి కుమార్తె వివాహ రిసెప్షన్లో రూ.4 బిలియన్ల విలువైన బహుమతులు అందుకున్నాడని, అదంతా అవినీతి డబ్బేనని ఆరోపించారు. ఇలాంటి అధికారులు చర్యలు తీవ్ర అవమానకరమని, దేశాన్ని కలుషితం చేస్తున్నారని వాపోయారు. బ్యూరోక్రాట్లు చేసిన పనులకు నాయకులు నిందలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది నేతలకు ఇళ్లు లేదా విదేశీ పౌరసత్వం లేదన్నారు. వాళ్లు ప్రజలను ఎదుర్కొని, ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉంటుందన్నారు. బ్యూరోక్రసీ దేశాన్ని కలుషితం చేస్తోందన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

రూ,8,00147.లక్షల, ముసునూరు మండలంలో 11 మంది బాధిత కుటుంబాలకు రూ,7,19,545.లక్షల. చాట్రాయి మండలంలో 4 కుటు-ంబాలకు, రూ,3,50,061.లక్షల, ఇతర ప్రాంత వాసుల 3 కుటు-ంబాలకు, రూ,1,58,134.లక్షల విలువైన చెక్కులను,బాధిత కుటు-ంబాలకు అందజేసిన మంత్రివర్యులు. పలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఇటీ-వల వైద్యం చేయించుకొని ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆర్జి పెట్టు-కున్న 49మంది కుటుంబాలకు సుమారు, రూ:31లక్షల చెక్కులను బాధిత కుటుంభాలకు అందించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు వైద్యం చేయించుకొని బిల్లులను ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ చేసుకోగా నేడు బాధితులకు చెక్కులను అందజేశారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు కూడా వైద్యం చేయించుకున్న బిల్లులను మా కార్యాలయంలో అందజేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సహాయం వెంటనే అందజేస్తానన్నారు. మెరుగైన వైద్యానికి కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని ప్రజలంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని ప్రజలంతా మెరుగైన వైద్యాన్ని సద్వినియోగం చెసుకోవలన్నారు. రాష్ట్ర మంత్రి పార్థసారథికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న మా కుటుంబాన్ని దేవుడి లా ఆదుకొన్నారని ఇలాంటి మంత్రి కి జీవితాంతం రుణపడి ఉంటామని, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు, కుటుంబ సభ్యులు తమ హర్షాన్ని కృతజ్ఞతను తెలియజేసారు,ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ, (మనం న్యూస్): సెప్టెంబర్ 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికకు భారత ఎన్నికల సంఘం తాజాగా గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. అధికారికంగా నామినేషన్ ప్రక్రియను ప్రారంభించింది. నోటిఫికేషన్‌లోని వివరాల ప్రకారం నామినేషన్లు దాఖలు చేయడానికి ఆగస్టు 21 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేది ఆగస్టు 25గా నిర్ణయించారు. మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పార్లమెంటు- వర్షాకాల సమావేశాల మొదటిరోజే ఆకస్మికంగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనివార్యంగా ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక జరగనుంది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ నిర్వహించే పరోక్ష ఎన్నికల ద్వారా ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు.రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరుగుతుంది. ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ఏ పార్టీ విప్‌కి కట్టుబడి ఉండనవసరం లేదు. ఉపరాష్ట్రపతిని పార్లమెంటు- సభ్యులు ఎన్నుకుంటారు. ఈ కారణంగా ఎన్‌డీఏ తన అభ్యర్థిని సులభంగా ఎన్నుకోగలదు. రెండు సభల ప్రస్తుత బలం 786. అభ్యర్థి గెలవడానికి 394 ఓట్లు- అవసరం. ఎన్‌డీఏకు లోక్‌సభలో 293 మంది ఎంపీలు, రాజ్యసభలో 129 మంది ఎంపీలు ఉన్నారు మొత్తం ఓట్ల బలం 422. ఇది ఉపరాష్ట్రపతి ఎన్నికకు అవసరమైన సంఖ్య కంటే అధికం.

## ముదరిన శాతవాహన కాలేజీ వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టినట్లు- వంకాయలపాటి కామేశ్వరరావు, బోయపాటి అప్పారావు మధ్య వివాదం నడిచింది.. ఆ తరువాత ఈ వివాదం సుప్రీంకోర్టు వరకూ కూడా వెళ్లింది.. ఆ తర్వాత శ్రీనివాసరావు, ప్రజాప్రతిరావులు కోర్టులో గెలిచి కూడా పిటిషన్ వెనక్కి తీసుకోవడం ఆశ్చర్యం కలిగించింది.. ఆ తరువాత కళాశాలను అర్ధరాత్రి పడగొట్టారని.. రిట్ పిటిషన్ లు విత్ డ్రా చేశారని ప్రజాప్రతిరావు కోర్టు ను ఆశ్రయించారు.. వంకాయలపాటి శ్రీనివాసరావు టెంపరరీ ప్రిన్సిపాల్ గా ఉంటూ రికార్డులు బయటకు ఇచ్చారు.. దీనిపై చర్చకు రావాలని నేను కోరినా ఆయన రాలేదు.. ఫోన్ లో ఎందుకు రాలేదని ప్రశ్నిస్తే.. నేను బెదిరించానని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు ఆలపాటి. శాతవాహన కళాశాల నడపాలన్నదే మా ఉద్దేశం అని స్పష్టం చేశారు ఆలపాటి రాజేంద్రప్రసాద్.. ఈ నెల 12న సుప్రీంకోర్టులో కేసు విచారణ ఉన్నందునే ఇప్పుడు వంకాయలపాటి శ్రీనివాసరావు కొత్త డ్రామా ఆడుతున్నారు.. అసలు తాత్కాలిక ప్రిన్సిపాల్ గా ఉన్న శ్రీనివాసరావుకు ఈ వివాదంతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు.. పద్దతి మార్చుకో... తప్పు చేయకు అని చెబితే... బెదిరింపులు అంటారా? అని మండిపడ్డారు. ఈ వివాదం లో పోలీసులు కు చిత్తశుద్ధి ఉంటే శ్రీనివాసరావు ను అరెస్టు చేయాలని టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో ప్రాణహాణి ఉందని.. రక్షణ కల్పించాలని విజయవాడ పోలీస్ కమిషనర్ కు ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. 2 నెలల క్రితం తనను ఆలపాటి అనుచరులు కళాశాల విషయంలో కిడ్నాప్ చేశారని.. ఆ సమయంలో పోలీసులకు తన కుమారుడు ఫిర్యాదు చేస్తే అర్థరాత్రి సమయంలో విడుదల చేశారని తెలిపారు. ఇప్పుడు తాజాగా మరోసారి ఆలపాటి తనను ఫోనులో బెదిరిస్తున్నారని వంకాయలపాటి సీపీకి ఫిర్యాదు చేసిన తర్వాత మీడియాకు తెలిపారు. శాతవాహన కళాశాల విషయంలో తన మాట వినాలని లేకపోతే తనను చంపేస్తానని ఆలపాటి బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై డీజీపీకి కూడా ఫోన్ కాల్ ఆడియోను కూడా జత చేసి ఫిర్యాదు చేసినట్టు- వంకాయలపాటి తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కూడా స్పందించారు. శాతవాహన కళాశాలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాను వంకాయలపాటిని ప్రిన్సిపల్ గా తొలగించాలని కరస్పాండెంట్ కు చెబితే ఆయన వద్దని వారించి శ్రీనివాస్ ను తన దగ్గరకు తీసుకువస్తానని చెప్పారని శ్రీనివాస్ రాకపోతే తాను ఫోన్ చేసిన మాట వాస్తవమన్నారు. అయితే తాను చంపేస్తానని బెదిరించలేదని కేవలం చట్టపరంగా చర్యలు తీసుకుంటానని తెలిపానన్నారు.

## అణు దాడిని స్మరించుకున్న జపాన్

టోక్యో, ఆగస్టు 7: హిరోషిమా నగరంపై అమెరికా అణుదాడి చేసి 8 దశాబ్దాలు అయిన సందర్భంగా జపాన్ ఆ విషాదాన్ని స్మరించుకుంది. ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబా అణు విధ్వంస స్మారకం వద్ద పుష్పమాల ఉంచి, ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. 1945, ఆగస్టు 6న జపాన్ లోని హిరోషిమా నగరంపై అమెరికా తొలి అణ్వాయుధాన్ని ప్రయోగించి 1.4 లక్షల మందిని హతమార్చింది. ఆగస్టు 8న నాగసాకి నగరంపై జరిగిన అణుబాంబు దాడిలో మరో 70 వేల మంది మరణించారు. ఈ దాడుల పర్యవసానంగా జపాన్ 1945 ఆగస్టు 15న అమెరికా కూటమికి లొంగిపోవడంతో రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది.

## 20వేల డాలర్లకో గ్రీన్ కార్డ్




(మొదటి పేజీ తరువాయి)

నలుగుతోన్న సమస్యకు పరిష్కారం చూపేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టాం'' అని చట్టసభ సభ్యురాలు మారియా ఎల్విరా సలజార్ పేర్కొన్నారు.ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం అమెరికా ఏటా.. 2,26,000 ఫ్యామిలీ ప్రిఫరెన్స్, 1,40,000 ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డులను జారీ చేసేందుకు వీలుంటుంది. ఈ 20వేల డాలర్ల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీ ద్వారా గ్రీన్ కార్డ్ బ్యాక్లాగ్లను క్లియర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపాధి కోసం అగ్రరాజ్యానికి వెళ్లి అక్కడే శాశ్వతంగా స్థిరపడాలనుకునే వలసదారులకు అమెరికా పర్మినెంట్ రెసిడెంట్ కార్డ్ (గ్రీన్ కార్డు)లను ఇస్తుంటుంది. అయితే, ఒక్కో దేశానికి నిర్ణీత సంఖ్య (కోటా)లో మాత్రమే వీటిని జారీ చేస్తుంటారు. మొత్తం దరఖాస్తుల్లో ఒక్కో దేశానికి కేవలం 7% మాత్రమే కేటాయించాలన్నది ప్రస్తుత విధానం. అయితే ఈ బిల్లులో దానిని 15 శాతానికి పెంచారు. అలాగే అమెరికాకు వర్క్ పర్మిట్ పై వచ్చిన దంపతుల పిల్లలు (డ్రీమర్ల)కు శాశ్వత నివాస హోదా పొందడానికి ఈ ప్రతిపాదిత బిల్లు వీలు కల్పిస్తుంది.

## 2047 లక్ష్యాలకు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

వాటా 17 శాతం. భారత్ ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్ వల్ల జీడీపీపై 50 బేసిస్ పాయింట్ల ప్రభావం పడే అవకాశం ఉంది. జీడీపీ వృద్ధి రేటు 50 బేసిస్ పాయింట్ల మేర నెమ్మదించి 6 లేదా 6.1 శాతంగా నమోదు కావొచ్చు. అయితే, వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కావడం వల్ల 50 బేసిస్ పాయింట్లను కోల్పోవడం అనేది పెద్ద లెక్క కాదు. ఏడాది పాటు ఈ భారాన్ని భారత్ మోయగలదు. ఏడాదికి మించితే మాత్రం 50 బేసిస్ పాయింట్ల భారం అనేది భారత లక్ష్యాలపై ప్రభావం చూపుతుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలవాలన్న వికసిత భారత్ లక్ష్యాలకు ఇది ఆటంకంగా మారొచ్చు'' అని వివరించారు. ఈ సుంకాల వల్ల చిన్న ఆదాయ వర్గాలపై ఎక్కువ ప్రభావం ఉంటుందన్నారు. అదే సమయంలో రష్యా నుంచి కాకుండా సౌదీ అరేబియా వంటి దేశాల నుంచి చమురు కొనుగోళ్లు జరిపితే ద్రవ్యోల్బణం పెరుగుతుందని, దీనివల్ల తక్కువ ఆదాయం గల కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. తద్వారా మొత్తం ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందన్నారు. మరోవైపు అమెరికాతో వాణిజ్యం విషయంలో మున్ముందు ఏం జరుగుతుందనే దానితో సంబంధం లేకుండా వివిధ దేశాలకు మన ఎగుమతులను పెంచుకోవాల్సిన అవసరం ఉందని దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. మరిన్ని దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాల్సి ఉందని, దేశంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

## ఎల్ఐసీ లాభం రూ.10,987 కోట్లు

ఢిల్లీ, ఆగస్టు 7: భారత ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 5 శాతం వృద్ధితో రూ.10,987 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. సమీక్షా త్రైమాసికంలో నికర ప్రీమియంల ఆదాయం 5 శాతం వృద్ధితో రూ.1.19 లక్షల కోట్లుగా నమోదైంది. వ్యక్తిగత, బిజినెస్ ప్రీమియంల పెరుగుదల కారణంగా ప్రీమియం వసూళ్లు పెరిగాయి.

ఐఆర్డీఏఐ డేటా ప్రకారం.. తొలి ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసీ 63.51 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. సమీక్షా త్రైమాసికంలో వ్యక్తిగత ప్రీమియం ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.71,474 కోట్లుగా నమోదైంది. గ్రూప్ ప్రీమియం ఆదాయం 2.46 శాతం పెరిగి రూ.47,726 కోట్లుగా నమోదైనట్లు ఎల్ఐసీ తన రెగ్యులేటరీ ఫైలింగ్లో పేర్కొంది. క్యూ1లో కొత్త పాలసీల విక్రయాలు గతేడాదితో పోలిస్తే 14.75 శాతం క్షీణించాయి. ఈసారి 30.39 లక్షల పాలసీలను విక్రయించింది.



# నేడు అమ్మవారి ఆలయంలో వరలక్ష్మి వ్రతం

### ఏర్పాట్లన్నీ సర్వం సిద్ధం

### ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి

**తిరుచానూరు, ఆగస్టు 07,మనం న్యూస్ :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతంను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి తెలిపారు. ప్రతియేటా శ్రావణమాసంలో పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఇందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ సర్వం సిద్ధమయ్యాయన్నారు. అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, నాలుగు మాడా వీధులను రంగవల్లులు, విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. వరలక్ష్మి వ్రతం జరిగే ఆస్థాన మండపాన్ని వివిధ పుష్పాలతో ముస్తాబు చేసి ప్రత్యేకంగా అష్టలక్ష్మి సెట్టింగ్ ను ఏర్పాటు చేశామన్నారు. వరలక్ష్మి వ్రతంకు సంబంధించి ఈ ఏడాది 500 టిక్కెట్లు ఆన్లైన్, ఆఫ్లైన్, అధికారుల కోటా కింద కేటాయించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆలయంలోని ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశామన్నారు. వరలక్ష్మి వ్రతం రోజున సుమారు 30వేలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక క్యూలైన్లతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి చర్యలు చేపట్టమన్నారు. ఉదయం 8 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతిస్తామన్నారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణరథోత్సవం జరుగుతుందని, దీనికి కావాల్సిన ఏర్పాట్లు కూడా పూర్తి చేశామన్నారు.

# శాస్త్రోక్తంగా తొండమాన్పురం శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 07,మనం న్యూస్ :** తొండమాన్పురం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చతుష్టర్చన, పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు ఆలయంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. యాత్రీకుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాది మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 09వ తేదీ పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదీర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించిన ఎస్వీ వైద్య కళాశాల

**తిరుపతి,ఆగస్ట్ 07,మనం న్యూస్ :** ఎస్వీ వైద్య కళాశాల చిన్నపిల్లల విభాగము నందు గత వారం రోజులుగా చిన్నపిల్లల తల్లులకు, వారి సహాయకులకు, తల్లిపాల ముక్యతను గురించి, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో వారం రోజులుగా అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించి, ఎంతోమంది తల్లులకు బిడ్డ పుట్టినప్పుడు నుండి పాలు ఆవశ్యకతను వారికి వివిధ పద్ధతులలో తల్లిపాలు పట్టించడం ఎలా అనే విషయాన్ని వైద్యులు, వైద్య విద్యార్థులు, మరియు నర్సింగ్ విద్యార్థులు, ద్వారా అవగాహన కల్పించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఆయన మాట్లాడుతూ తల్లిపాలు ముఖ్యత్వం గురించి, వాడ వాడలా, గ్రామాల వారీగా గత వారం రోజులుగా ప్రపంచ తల్లిపాలు దినోత్సవం నిర్వహించాము.

ఈరోజు ముగింపు సమావేశంలో చాలామంది తల్లులు ఈ ఆవశ్యకత గురించి తెలుసుకోవడానికి ముందుకు రావడం, తల్లిపాలు ముఖ్యత్వం గురించి, చిన్నపిల్ల తల్లుల సహాయకులకు కూడా, ఈ సందర్భంగా వారికి అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమం ఎస్ వి వైద్య కళాశాల, ఆధ్వర్యంలో ప్రసూతి ఆసుపత్రి మరియు చిన్న పిల్లల ఆసుపత్రి ఘనంగా నిర్వహించి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగ ప్రొఫెసర్ డాక్టర్ జయచంద్ర నాయుడు, డాక్టర్ అంజన్ కుమార్, వైద్యులు వైద్య విద్యార్థులు, మరియు నర్సింగ్ విద్యార్థులు తదుతరులు పాల్గొన్నారు.



# శ్రీ వేంకటేశ్వర ప్రాణదానం ట్రస్టుకు రూ. కోటి విరాళంగా అందజేసిన భక్తుడు

**తిరుమల,ఆగస్టు 07,న్యూస్ :** శ్రీ వేంకటేశ్వర ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.కోటి విరాళంగా అందింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తో కలిసి బెంగుళూరుకు చెందిన దాత సికెపిసి ప్రాపర్టీస్ మేనేజింగ్ డైరెక్టర్ చిరాగ్ పురుషోత్తం ఈ మేరకు విరాళంకు సంబంధించిన డి.డి.ని టీటీడీ బోర్డు చైర్మన్ బీ.ఆర్ నాయుడుకు అందజేశారు. తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఎందరో పేద రోగులకు శ్రీ వెంకటేశ్వర ప్రాణదానం ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యాన్ని అందిస్తున్న టీటీడీ సేవలను దాత కొనియాడారు.

గుండె, మూత్రపిండాలు, మెదడు మొదలైన ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న అనేకమంది పేదలకు ఉచిత సేవలందిస్తున్న ఇలాంటి గొప్ప ట్రస్ట్ కు మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో రూ. కోటి విరాళం అందజేసినందుకు దాత చిరాగ్ పురుషోత్తం ను టీటీడీ బోర్డు చైర్మన్ అభినందించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.



# తిరుపతిలో కాంచీపురం వరమహాలక్ష్మి సిలక్స్ షోరూం శుభ ప్రారంభం

**తిరుపతి,ఆగస్టు 07,మనం న్యూస్ :** సాయి సిలక్స్ ( కళామందిర్ ) లిమిటెడ్ తమ కార్య కలాపాలను విస్తృతం చేయడంలో భాగంగా తమ సంస్థ యొక్క ప్రముఖ చీరల బ్రాండ్ కాంచీపురం వరమహాలక్ష్మి సిలక్స్ ను తిరుపతి, అన్నమయ్య సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్డు లో గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ షోరూంను ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకర్త శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి మరియు టీటీడీ బోర్డు చైర్మన్ బీ.ఆర్ నాయుడు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇతర ప్రముఖులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వరమహాలక్ష్మి సిలక్స్ డైరెక్టర్ రాజేష్ అన్నం మాట్లాడుతూ తమ సంస్థ యొక్క 70వ షోరూంను తిరుపతిలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. తమ వద్ద స్వచ్ఛమైన కంచి పట్టుచీరలు, హ్యాండ్లూమ్, బనారస్, పటోల కోట, పైతాని, కుప్పడం, ప్రీమియం ఎత్నిక్ మరియు అన్ని రకాల చీరలు అత్యంత తక్కువ ధరలకు లభిస్తాయని అన్నారు.

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, కర్ణాటకలో, మరియు వివిధ బ్రాండ్ల రూపంలో మా కార్యకలాపాలు నిర్వహిస్తుండగా ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో కాంచీపురం వరమహాలక్ష్మి సిలక్స్ 8వ షోరూం అని తెలిపారు. కాంచీపురంలో అతిపెద్ద షోరూం కలిగి ఉండటంతో పాటు సొంత మగ్గాలు, చేనేత కార్మికులు ఉండడంతో మార్కెట్లో మరెవ్వరు ఇవ్వలేని క్వాలిటీ మరియు ధరలు తమ బ్రాండ్ ఇవ్వగలుగుతుంది అని తెలిపారు.

ఇటీవలే సాయి సిలక్స్ ( కళామందిర్ ) లిమిటెడ్ ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే.



# పద్మావతి అమ్మవారి వరలక్ష్మి వ్రతం ఆఫ్ లైన్ టికెట్లు

- భక్తులకు అందజేస్తున్న డిప్యూటీ ఈవో హరింద్రనాథ్

**తిరుచానూరు,ఆగస్టు 07,మనం న్యూస్ :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 8వ తేదీన వరలక్ష్మి వ్రతాన్ని అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో నిర్వహించనున్న విషయం విధితమే. ఈ క్రమంలో గురువారం టిటిడి వారు ఆఫ్లైన్ ద్వారా 150 టికెట్లను భక్తులకు విక్రయించారు. టికెట్లను ఉదయం 9 గంటల నుండి పంపిణీ చేయడానికి ప్రారంభించగా భక్తులు ఉదయం 6 గంటల నుండి క్యూ లైన్ లో వేచి ఉండి టికెట్లను పొందారు. కావున భక్తులందరూ శ్రీ పద్మావతి అమ్మవారి సేవలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, వీజీవో సురేంద్ర, ఏవీఎస్వో లు రాధాకృష్ణ మూర్తి, రమేష్, ఎఇఓ దేవరాజులు సూపరింటెండెంట్ రమేష్, విఐ మోహన్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీవారి సేవలో ఏపీ రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్

**తిరుమల,ఆగస్టు 07, మనం న్యూస్ :** తిరుమల శ్రీవారిని ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి విరామ సమయంలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితుల వేద ఆశీర్వచనం అందించగా ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ... శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా సస్యశ్యామలంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్టు తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని... మొన్న అన్నదాత సుఖీభవ ఇవాళ చేనేత కార్మికులకు..అలాగే నాయి బ్రాహ్మణులకు ఉచిత కరెంటు ఇస్తున్నట్టు...రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షాగా ఉండాలని అన్నారు.



# అమ్మవారి సేవలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ అనగాని సత్య ప్రసాద్

**తిరుచానూరు,ఆగస్టు 07,మనం న్యూస్ :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, వీజీవో సురేంద్ర, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయాధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ నీ తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి, హరిరామ్ రెడ్డి, దామ సాయి రాయల్ ఘనంగా సన్మానించారు.



## గీతలు చెరపిన సీతలు

సునామీలా చెలరేగిన కోరికలు
తాళి తెంపి చేస్తున్న వేడుకలు
నిప్పులు కక్కుతూ ఉబికి వచ్చే

లావాలా ప్రవహించే వాంఛలు
బంధాలను రక్త సంబంధాలను
సజీవ దహనం చేసే నిప్పు కణికలు

ఆస్తి పై ఆసక్తి కన్న వారినే
కడతేర్చే మానవ మృగాలకు
దయా దాక్షిణ్యాలు నాస్తి

వావి వరుసలు లేని కాంక్షలు
వయసుతో సంబంధంలేని తృష్ణలు
విహంగాలై విహరించి బరి
తెగించి తీర్చు కునే శారీరిక ఆకాంక్షలు

ప్రియురాలు చేసే హత్యలతో
ప్రియుని ఘాతుకాలతో
జీవితాలు అల్లకల్లోలం

గీతలు దాటిన
సీతలు కొందరు
నుదుటి గీత గీసుకున్న
వనితలు మరికొందరు

**- పూసాల సత్యనారాయణ**
9000792400

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# అమెరికా సుంకాలు-భారత్‌ను దెబ్బతీస్తాయా?



ఒకసారి ఓడి నాలుగేళ్ళ తర్వాత తిరిగి అధికారం లోకి వచ్చి, అమెరికా శ్వేత సౌధంలోకి అడుగు పెట్టడం చాలా అరుదైన అంశం. అలాంటి అరుదైన అవకాశం దక్కిన అమెరికా అధ్యక్షుల్లో గ్రోవర్ క్లీవ్ లాండ్ ఒకరు కాగా, ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరొకరు. ట్రంప్ రెండవ సారి అధికారంలోకి రావడానికి అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు కూడా తమ వంతు కృషి చేసారు. ఎన్నికల వరకు భారత్ తన మిత్ర దేశం, మోడీ తన మిత్రుడంటూ పొగిడిన ట్రంప్‌కు అధికారం రాగానే అహం నెత్తికెక్కింది. అక్రమ వలస దారులంటూ అత్యంత చులకన చేసి, కొంతమంది భారతీయులకు సంకెళ్ళు వేసి, యుద్ధ విమానాల్లో భారత్‌కు పంపించి, అత్యంత అవమానకరంగా ప్రవర్తించిన ట్రంప్ భారత్ పై ఇంకా తన అక్కసును వెళ్ళగక్కుతూ, భారత్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని ప్రయత్నించడాన్ని ప్రపంచ దేశాలన్నీ గుర్తించాలి. అధ్యక్ష ఎన్నికల ముందు వరకు రష్యా కు అనుకూలంగా,పుతిన్‌కు రహస్య మిత్రుడిగా పేరొందిన ట్రంప్ తన అవసరం తీరగానే రష్యా పైన, రష్యాకు చిరకాల మిత్రదేశమైన భారత్ పైన అసూయతో రగిలిపోతూ,టారిఫ్‌ల రూపంలో అర్థరహితమైన ఆంక్షలు విధించడం అనైతికం. ఏఏ దేశాలు ఎవరితో స్నేహం చేయాలో, ఎవరి వద్ద ఆయుధాలు కొనాలో నిర్ణయించడానికి అమెరికా కున్న హక్కేమిటి? అర్హతలేమిటి? ప్రపంచాన్ని శాసించమని ట్రంప్ కు ఎవరు అధికారమిచ్చారు? ఇతర దేశాలపై అమెరికా కర్ర పెత్తనమేమిటి? ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలకు అమెరికా ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం కారణం కాదా? రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి అమెరికా నాయకత్వంలోని నాటో దేశాల నిర్వాకమే మూల కారణం. జెలెన్‌స్కీని రెచ్చగొట్టి, ఉక్రెయిన్ కు ఆయుధ, ఆర్థిక సహాయ మందించి, రష్యా- ఉక్రెయిన్ల మధ్య మూడున్నర సంవత్సరాలుగా యుద్ధం జరగడానికి అమెరికా అండదండలే కారణమన్న సత్యం విస్మరించగలమా?

రష్యాతో చమురు ఒప్పందం కుదుర్చుకోవడమే భారత్ చేసిన తప్పిదంగా అమెరికా భావించడం, భారత్ రష్యాతో ఆయుధ, ఇతర వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం మానుకోకపోతే అధిక టారిఫ్‌లు విధిస్తానని ప్రకటించి, అనుకున్న విధంగానే భారత్ పై రెండు విడతలుగా 50 శాతం వరకు అర్థిక సుంకాలు విధించడం,ఇదే సందర్భంలో తాను చిరకాల ప్రత్యర్థిగా భావించే చైనా పై కేవలం 30శాతం టారిఫ్ విధించి, టారిఫ్ అమలుకు ఎక్కువ గడువును ప్రకటించడం ట్రంప్ ద్వంద్వ ప్రమాణాలకు దర్పణం పడుతున్నది.

మిత్ర దేశమంటూనే భారత్ కు వెన్ను పోటు పొడవడం ద్వారా ప్రపంచానికి ట్రంప్ ఇచ్చే సంకేతమే మిటి? భారత్ ఆర్థికంగా బలపడకూడదనే ఏకైక లక్ష్యమే ట్రంప్ లో అగుపిస్తున్నది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ కు సంబంధం ఏమిటి? భారత్ రష్యాతో వాణిజ్య సంబంధాలు కలిగి ఉండడం వలన రష్యా ఆర్థికంగా బలపడి ఉక్రెయిన్ పై యుద్ధం చేయగలుగుతుందనే ట్రంప్ వాదన సత్య దూరం. ఉక్రెయిన్ కు అమెరికా, నాటో దేశాలు ఆయుధ సహకారం అందించకపోతే ఇన్ని సంవత్సరాలుగా ఉక్రెయిన్ రష్యాతో యుద్ధం చేయగలిగి ఉండేదా? నాటో లో చేరాలనే జెలెన్ స్కీ నిర్ణయమే పుతిన్ ఆగ్రహానికి, ఉక్రెయిన్‌తో యుద్ధానికి మూలకారణం. ఇప్పటికైనా ఉక్రెయిన్ అధ్యక్షుడు తమ దేశం నాటోలో చేరబోదనే హామీ ఇవ్వగలడా? అమెరికా అందుకు ఉక్రెయిన్ ను ఒప్పించగలదా? ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి చరమగీతం పలుకుతానని ప్రగల్భాలు పలికిన డోనాల్డ్ ట్రంప్, యుద్ధం ఆపలేక చివరికి ఉరిము రిమి మంగళం మీద పడినట్లు నెపమంతా భారత్‌పై నెట్టి, ప్రతీకార సుంకాలతో భారత్‌ను బెదిరించడం శతాబ్దాల ప్రజాస్వామ్య అమెరికా చరిత్రకు మాయని మచ్చ. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుని ట్రంప్‌కు మద్దతు నిచ్చిన రిపబ్లికన్ పార్టీ నాయకురాలు నిక్కీ హేలీ భారత్‌పై ట్రంప్ విధిస్తున్న వాణిజ్య సుంకాలను తప్పుబడుతూ, భారత్ వంటి బలమైన దేశంతో సంబంధాలను తెంపుకోరాదని సూచించడం గమనార్హం. అమెరికాలో ఇప్పటి వరకు ఎంతో మంది అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. కాని ట్రంప్ వంటి నాయకుడొస్తే ఏం జరుగుతుందో బహుశా అమెరికా ప్రజలు కూడా ఊహించి ఉండరు. ఇప్పటి వరకు తాను ఆరు యుద్ధాలను ఆపానని, తాను లేకపోతే అణ్వాయుధ యుద్ధం జరిగి ఉండేదని, భారత్- పాక్ ల మధ్య కూడా తానే మధ్యవర్తిత్వం వహించి, యుద్ధాన్ని నివారించానని ట్రంప్ పదే పదే పేర్కొనడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ ఇంతగా దిగజారిపోవడం సిగ్గు చేటు. ఉగ్రవాద దేశమైన పాక్ కు మద్దతు నీయడమే కాకుండా ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాక్ సైనికాధిపతి మునీర్ తో కలిసి శ్వేతసౌధంలో విందారగించడం ట్రంప్ దిగజారుడు తనానికి నిదర్శనం. అన్ని రంగాల్లోను అభివృద్ధి సాధించానని చెబుతున్న అమెరికా నేడు ఆర్థికంగా పతనమై పోయింది.ఇతర దేశాల బలహీనతలపై దెబ్బకొట్టి,కొర్రీలుపెట్టి, పరాన్న జీవిలా మనుగడ సాగించే దుస్థితి అగ్రరాజ్యానికి ఏర్పడడం దౌర్భాగ్యం. తమ వద్దే ఆయుధాలు కొనాలని అమెరికా వాంఛించడం మూర్ఖత్వం. శాంతి వచనాలు వల్లించే అగ్రరాజ్యాధినేత ట్రంప్‌కు ఆయుధాలతో సంబంధమేమిటి? ఒక యుద్ధ పిపాసికి నోబెల్ శాంతి పొందాలన్న ఆశ,ఆరాటం ఎందుకు? అమెరికా పట్ల భారత్ జాగరూకత వహించాలి. భారత్ పై కక్షతో అమెరికా అధ్యక్షుడు పాక్‌కు ఆయుధ,ఆర్థిక సహాయం చేసే అవకాశ ముంది. ఆర్థికంగా పతనమై, ప్రజల తిరుగుబాటుతో చిన్నాభిన్నమౌతున్న పాక్ కు అమెరికా వత్తాసు పలకడమేమిటి ? భారత్ ఆర్థిక వ్యవస్థను మృత ఆర్థిక వ్యవస్థ గా పేర్కొనడమే కాకుండా భారత్ లో అమెరికా కంపెనీలు పెట్టుబడులు పెట్టవద్దని, భారతీయులకు ఉద్యోగాలివ్వ రాదని ట్రంప్ బెదిరించడం హాస్యాస్పదం. అమెరికా ఆర్థిక వ్యవస్థలో భారతీయుల స్థానం కీలకమైనది. ఈ విషయాన్ని విస్మరించడం ట్రంప్ హ్రస్వ దృష్టికి నిదర్శనం. అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా,భారత్ ఎప్పటి మాదిరిగానే రష్యాకు మిత్రదేశంగా మెలగాలి. అమెరికా దురహంకారానికి లొంగకుండా భారత్ అన్నిరంగాల్లో స్వయం స్వావలంభన సాధించాలి.




**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# వరదాయిని వరలక్ష్మీ దేవి

'నమస్తేస్తు మహామాయే, శ్రీపీఠే సుర పూజితే; శంఖ చక్రగదా హస్తే, మహాలక్ష్మీ క నమో స్తుతే. శంఖ చక్ర గద ధారణియైన మహా లక్ష్మీ దేవి సంపద,భూమి,శిక్షణ,ప్రేమ,కీర్తి,శాంతి, సంతోషం, శక్తి లాంటి అష్టైశ్వర్య ప్రదాయిని. అష్టసంపదలు ఒసంగే జగన్మంగళ దాయిని. అష్టైశ్వర్యాలు కలుగజేసే రూపం వరలక్ష్మిగా ఆరాధనీయం. కొలిచిన వారికి కొంగు బంగారమై వరాలనిచ్చే జగజ్జనని వరలక్ష్మి. అన్ని లక్ష్మీ పూజల కన్నా, వరలక్ష్మీ పూజ ఉన్నతమైనదని శాస్త్ర వచనం. వరలక్ష్మీ దేవత విష్ణు మూర్తి భార్య. వైకుంఠ నాథుని జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రంతో కూడిన పౌర్ణమి కల శ్రావణ మాసంలో వరలక్ష్మిని ఆరాధిస్తే, విశేష ఫలమని భావన. ఆయురారోగ్య ఐశ్వర్య సంతోషాదులు లక్ష్మీదేవిని అత్యంత ప్రియమైన శుక్రవారం పూజిస్తేనే కలుగుతాయని శ్రీ సూక్తం వివరిస్తున్నది. వరలక్ష్మిని షోడ శోపచార పూజలతో సేవిస్తే, అష్ట ఐశ్వర్యాలు, అయిదవతనం, సత్సంతానం, సంతానాభివృద్ధి కలకాలం ఉండగలవని శాస్త్ర వచనాలు. సకల కోరికెలు ఈడేరాలని, సర్వమంగళ సంప్రాప్తి కలగాలని, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని ఈ వ్రతాన్ని వివాహితులు వ్రతాన్ని ఆచరిస్తారు. వరాలు యిచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారు. ఈ పూజలు ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అధికంగా స్త్రీలు కొలుస్తారు. ఈ పండగను ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారు. శ్రావణ శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు అరు దెంచే శుక్రవారం సువాసినులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం హిందూ సంప్రదాయం మంచి భర్త, సత్సంతానం కలుగాలని అమ్మాయిలు పూజిస్తారు. ఈ రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలు పంచు కుంటారు. దేవతను పూజిస్తే అష్ట ఐశ్వర్యాలు... సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ



విశ్వాసం. కైలాస నాథుడు, పార్వతీదేవికి వరలక్ష్మీ వ్రతాచరణ గురించి వివరించినట్లు స్కంద పురాణంలో ఉంది. లోకంలో స్త్రీలు సకలైశ్వర్యాలు, పుత్రపౌత్రాదులను కలిగేందుకు ఏదైనా వ్రతం గురించి తెలపాలని పార్వతీ దేవి, పరమ శివుని కోరగా, వరలక్ష్మీ వ్రతాన్ని అభయంకరుడుడైన శంకరుడు వివరించారు. ఈ సందర్భంలోనే భర్తపట్ల ఆదరాన్ని అత్తమామల పట్ల గౌరవాన్ని ప్రదర్శించిన మగధ రాజ్య అంతర్గత కుండిన నగర వాసియైన పరమ సాధ్వి చారుమతి ఉత్తమ ఇల్లాలిగా ప్రవర్తించిన నేపథ్యాన్ని వివరించారు.

మహాలక్ష్మిని చారుమతి చిత్తశుద్ధితో పూజించిన క్రమంలో వర లక్ష్మి ఆమెకు స్వప్న సాక్షాత్కారమై, శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం తనను ఆరాధిస్తే, కోరిన వరాల్ని ఒసంగెదనని వరమిచ్చినట్లు కథనం. ముందుగా గణపతిని పూజించి కలశం లోనికి అమ్మవారిని ఆవాహన గురించి షోడశోపచార పూజ, అథాంగ పూజ చేయాలి.

**'సర్వమాంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే'!!** అంటూ పూజ చేయాలి. అష్టోత్తర శత నామాల యుక్త దూప, దీప, నివేదన, తాంబూలాలను సమర్పించి, కర్పూర నీరాజనం, మంత్ర పుష్పం, మంగళ హారతి సమ ర్పణ గావించి, తొమ్మిది దారపు పోగులతో తొమ్మిది ముడులను వేసి, మధ్యన పంచ పుష్పాలు కట్టి తోర గ్రంధి చేసి తోర గ్రంధి పూజ, తోర గ్రంధి మంత్ర పఠనం చేయాలి. **'లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం, శ్రీరంగ ధామేశ్వరీం, దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం, శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ, బ్రహేంద్ర గంగాధరాం, త్వాం త్రిలోక్య కుటుంబినీం సరసిజాం, వందే ముకుంద ప్రియాం'** అని స్తుతించాలి.

నవ సూత్ర ధారణను కుడి చేతికి చేయాలి. ఫలభక్ష్య పానీయ పాయసాదులను అమ్మవారికి సమర్పించి, చివరగా వాయన దాన మంత్రంతో ముత్తయిదువను మహాలక్ష్మిగా భావించి, తాంబూలం అందించాలి. భక్తితో వేడుకొంటే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. వరలక్ష్మీ వ్రతం చేసినను, ఈ వ్రతం చేసినప్పుడు చూసినా కూడా సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యాలు కలిగుతాయని సూత మహాముని శౌనకాది మహర్షులకు వివరించినట్లు పురాణ కథనం. ఈ వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది.

ఈ వ్రతాచరణ వల్ల లక్ష్మీదేవి కృప కలిగి సకల శుభాలు కలుగుతాయి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

**- రామకిష్టయ్య సంగనభట్ల**
9440595494

# యుద్ధం ఇప్పట్లో ఆగేలా కన్పించడం లేదు...

రష్యా, ఉక్రెయన్ యుద్ధం కొత్త దిశలో పయనిస్తోంది. రష్యా భీకర దాడులు చేస్తూ,ఉక్రెయన్‌ని వణికిస్తోంది. యుద్ధం ఆపుతానని అగ్ర దేశ నేత సైతం మౌనం వహించి, ఉక్రెయన్ వంకే ఉండటం రష్యాకు ఆగ్రహం కలిగించింది. దానికి తోడు జెలెన్‌స్కి ప్రకటనలు మాస్కోకు ఆగ్రహం తెప్పించింది. ఆ ప్రకటనల సారాంశం ఏమిటంటే రష్యాకు, చైనా, పాక్ సైనికుల అండ ఉంది అనే మాట. వాస్తవానికి రష్యాకు ఒక్క ఉత్తరకొరియానే బాహాటంగా మద్దతు ఇస్తోంది.పాక్ కూడా రష్యా కు అండగా ఉంది అనే మాట పాక్ గట్టిగా ఖండించింది. కీవ్ అధికారులు ఎవ్వరూ తనను సంప్రదించలేదని పాక్ పేర్కొంది. మేము ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదు అని పాక్ చెప్పడం, ఆ దిశలోనే చైనా కూడా మాకు సహాయం అందించింది అని ఉక్రెయన్ చెప్పడంతో చైనా, ఉక్రె యన్ ఆరోపణలను ఖండించింది. ఇది ఇలా ఉండగా ఉక్రెయన్‌లోని వోవ్ ఛాన్స్‌కీ ప్రాంతంలో తమ సైనికులతో జెలెన్‌స్కి భేటీ కావడం సైనికులలో కొత్త ఉత్సహాన్ని నింపినట్లు అయింది. ఉక్రెయన్‌కు మద్దతుగా చైనా,తజకిస్తాన్, ఉజ్బె కిస్తాన్, పాకిస్తాన్‌తో సహా ఆఫ్రికా దేశాలు కూడా ఉన్నాయి. వీరందరికి జెలెన్‌స్కి ధన్యవాదాలు చెప్పడం, పాక్, చైనా దేశాలు మేము ఉక్రెయన్‌కు అసలు మద్దతే ఇవ్వలేదు అని చెప్పడం, ఉత్తర కొరియా మాత్రం మేము రష్యాకు మద్దతు ఇస్తాం. ఆయుధాలు ఆ దేశానికి సమాకూరుస్తాం, ఇప్పటికే ఉత్తర కొరియా వెయ్యికి పైగా బలగాలను పంపింది. ఆయుధాలు కూడా రష్యాకు అందిస్తామని ప్రకటించింది. ఉత్తర కొరియా, రష్యా ప్రక్కన దిగితే మాత్రం ఉక్రెయన్‌కు గడ్డు కాలమే. అందుకనే ఉక్రైన్ ఎక్కువగా అమెరికాపై ఆధారపడుతూ, యుద్ధాన్ని ఆపాలనే ఆలోచన లేకుండా, పౌరుల సంక్షేమం, దేశ అభివృద్ధి పట్టక ఇతర దేశాలపై ఎక్కువగా ఆధార పడుతోంది. పరస్పర దాడులు రెండు దేశాలు చేసుకుంటూ యుద్ధాన్ని మరో కోణం లోకి తీసుకు వెళ్ళారు. దీనికి తోడు అగ్రనేత ఆ దేశాలపై సుంకాలు పెంచుతామనే ప్రకటన కూడా మంచిది కాదు. యుద్ధం ఆపే ప్రయత్నం అమెరికా నేత చేయాలి. అమెరికా మాట ఉక్రెయన్ వింటుంది. ఉక్రెయన్‌కు తగిన విధంగా చెబితే యుద్ధం ఆగుతుంది. రెండూ దేశాల మధ్య రాజీనే విశ్వానికి కావాల్సింది. శాంతిదూత నేనే అని చెప్పుకునే నేతకు రష్యా, ఉక్రెయన్ యుద్ధం ఆగిపోతే నిజంగా దానికి అర్హుడు అవుతాడు. నేను అధికారంలోకి ఉంటే కేవలం ఒక్క రోజులోనే యుద్ధం పరిసమాప్తి చేస్తా అనే మాట నిలబెట్టుకోవాలి కాని ఇలా ఉక్రెయన్‌కు సహాయ, సహకారాలు ఇవ్వ కూడదు. రష్యా, అమెరికా రెండూ బలమైన దేశాలు, ఐక్యరాజ్య సమితి, భద్రతా సమితిలో శాశ్వత సభ్య దేశాలు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకోవాల్సిందే. అమెరికా, రష్యాకు బదులు ఉక్రైన్ బుజ్జగించాలి. అమెరికా మాట ఉక్రెయన్ తప్పక వింటుంది. వినకపోతే దాని పర్యావసానం ఏమిటో ఉక్రైన్ కు బాగా తెలుసు. యుద్ధం ఆగకపోవటానికి అగ్ర దేశం లోపాయకారిగా ఉక్రెయన్ వంక ఉండటమే. అందుకే యుద్ధం ఆగే సూచనలు ఇప్పట్లో కనిపించటం లేదు.




**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

# ఎఫ్.ఏ -1 పరీక్షలు ఆగస్టు 15 తర్వాత నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి ఫార్మెటివ్ అసెస్మెంట్ పరీక్షలను ఆగస్టు 11 నుంచి 13 వరకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఆగస్టు 11 నుంచి 14 వరకు ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించాలని పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. కానీ ఆగస్టు నెలలో 15వ తేదీన ప్రతీ పాఠశాలలో విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. దీనికోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పాఠశాలల్లో నిర్వహించుకునేందుకు సంసిద్ధతా కార్యక్రమాల్లో ఉంటారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు పోటీలు లాంటివి నిర్వహించడంలో నిమగ్నమై ఉంటారు. ఈ సమయంలో పరీక్షలు నిర్వహించడం సరైనది కాదు. కావున ప్రభుత్వం ఎఫ్ ఏ-1 పరీక్షలను ఆగస్టు 15 తర్వాత నిర్వహించాలి. ఆగస్టు 15 తర్వాత పరీక్షలు నిర్వహించే విధంగా విద్యాశాఖ అధికారులు వెసులుబాటు కల్పించాలి.

**- వాసిలి సురేష్**
9494615360

# భారతీయ సమాజంలో ఎవరు ఓసిలు..ఎవరు బీసీలు..?

చారిత్రకంగా భారతీయ సమాజం కుల వ్యవస్థ ఆధారంగా శతాబ్దాలుగా నిర్మితమై ఉంది, ఇది సామా జిక, ఆర్థిక, రాజకీయ గతిశీలతలను ప్రభా వితం చేస్తున్నది. ఈ వ్యవస్థను ప్రస్తుతం ఓపెన్ కేటగిరీ (ఓసీ), వెనుకబడిన కులాలు (బీసీ లేదా ఓబీసీ), షెడ్యూల్ కులాలు (ఎస్సీ), మరియు షెడ్యూల్ తెగలు (ఎస్టీ) అనే వర్గాలుగా విభజించారు. బ్రిటిష్ పాలనా కాలంలో 1881 నుండి 1931 వరకు నిర్వహించిన జనగణనలు కుల ఆధారిత జనాభా వివరాల్ని సేకరించాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కల్లో కులాల వివరాల్ని నమోదు చేయలేదు, కాబట్టి ఆయా సామాజిక వర్గాల వారీగా ఖచ్చితమైన జనాభా శాతాలపై స్పష్టత లేదు. స్వాతంత్ర్య అనంతరం భారత ప్రభుత్వం కుల గణనను నిలిపివేసి, పదేళ్ళకోసారి చేసే జనగణనలో ఎస్సీ మరియు ఎస్టీ గణనపై దృష్టి సారించింది, దీనివల్ల ఓసి, ఓబీసీ జనాభా డేటా లభ్యత పరిమితమైందని చెప్పవచ్చు.

ఓసీ మరియు బీసీల గుర్తింపు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఆధారపడి ఉంటుంది. ఓసీ కేటగిరి సాధారణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో పాటు రిజర్వేషన్ ప్రయోజనాలు పొందని ఇతర కులాల్నికూడా సూచిస్తుంది.

బీసీ లేదా ఓబీసీలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగ తులుగా రాజ్యాంగం ఆర్టికల్ 15(4) కింద నిర్వ చించబడ్డాయి. కానీ, కుల వర్గీకరణలో కొంత సంక్లిష్టత నెలకొని ఉంది, కేంద్ర జాబితాలో ఓబీసీ లుగా గుర్తించబడిన కొన్ని కులాలు వివిధ రాష్ట్రాలలో ఓసీ, ఎస్సీ, లేదా ఎస్టీలుగా వర్గీకరిం చడ్డాయి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1970 వ దశకం వరకు బీసీ జాబితాలో లంబాడా సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చడం జరిగింది. ఓబీసీలను ఏ, బీ, సీ, డీ, ఈ గ్రూపులుగా విభజించారు, తెలంగాణలో మున్నూరు కాపులు బీసీ జాబితాలో ఉంటే ఆంధ్ర ప్రదేశ్‌లో కాపులు ఓసీ జాబితాలో ఉన్నారు. కర్ణాటకలో రెడ్లు బీసీ జాబితాలో ఉంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఓసీలుగా ఉన్నారు. ఇలా వివిధ కులాలు కేంద్ర, రాష్ట్రాల జాబితాలు వేర్వే రుగా ఉండటం వల్ల ఒక రాష్ట్రంలో ఓసీలుగా ఉన్న వారు, మరొక రాష్ట్రంలో బీసీలు జాబితాలో ఉన్నా రు. అదే విధంగా బీసీలుగా ఉన్నవారు మరికొన్ని రాష్ట్రాల్లో మరొక వర్గంలో ఉన్నారు.

ఇక్కడే అసలు దేశంలో ఓసీలు ఎవరు..? బీసీలెవరు అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. జన్మ ద్వారా వచ్చిన కులాన్ని మార్చడం సాధ్యం కాదు కానీ, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనకబాటు ఆధారంగా వారికి రిజర్వేషన్ కల్పించి వారి పురోభివృద్ధికి చర్యలు తీసుకోవడం అనివార్యం. అందుకే ప్రభుత్వం కుల, మత, వర్గాలకు అతీతంగా బీసీ, ఎస్సీ ఎస్టీ వర్గాలతో పాటు వారి రిజర్వేషన్ ప్రయోజనాలకి భంగం కలగకుండా ఓసీల్లో ఉన్న పేదలకు కూడా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించింది. రిజర్వేషన్ మినహాయించిన తర్వాత మిగిలిన ఓపెన్ కేటగిరీలో అన్ని సామాజిక వర్గాల వారు సమానంగా పోటీ పడే అవకాశం ఉంటుంది.



ఈ అంశంపై సుప్రీం కోర్టులో వాదనలు జరిగినపుడు ఈ చట్టానికి అనుకూలంగా తీర్పు రావడం గమనార్హం.

1953లో ఏర్పాటైన కాకా కలేల్కర్ కమిషన్ దాదాపు రెండు వేలకు పైగా వెనుకబడిన కులాలను గుర్తించింది, కానీ దాని సిఫార్సులు అమలు కాలేదు.

1979లో ఏర్పాటైన మండల్ కమిషన్ దాదాపు మూడు వేల కులాలను ఓబీసీలుగా వర్గీకరించి, 27% రిజర్వేషన్ను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో సిఫారసు చేసింది. 1990లో వి.పి. సింగ్ ప్రభుత్వం ఈ సిఫారసును అమలు చేసింది, ఇది దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా మారింది. 1992లో ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు 27% రిజర్వేషన్‌ను సమర్థించి, క్రీమీలేయర్‌ను మినహాయించాలని ఆదేశించింది. తదనంతరం, ఈ రిజర్వేషన్ ప్రభుత్వ విద్య, ఉద్యోగ అవకా శాలకు విస్తరించబడింది.

రిజర్వేషన్ విధానం ఓబీసీలకు విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, రాజకీయ రిజర్వేషన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు ఉన్నట్లు ఓబీసీలకు చట్ట సభల్లో ప్రత్యేక కోటా లేదు, భారతీయ సమాజంలో ఎస్సీ, ఎస్టీలతో పోల్చితే కొంతవరకు సామాజికంగా, ఆర్థికంగా బీసీలు పురోభివృద్ధి సాధించినందున ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దాదాపు జనాభా శాతానికి సమానంగా రిజర్వేషన్ కల్పించినప్పటికి, బీసీ జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్ కల్పించి ఉండక పోవచ్చు. సమకాలీన సందర్భంలో, కుల గణన అనేది ఒక కీలక అంశంగా మారింది. ఈసారి జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గణన ఆయా సామాజిక వర్గాల జనాభా, ఆర్థిక స్థితిగతులపై స్పష్టతనిచ్చే అవకాశం ఉంటుంది.

ఆయా సామాజిక వర్గాలకి పూర్తి స్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందాలంటే క్రీమీ లేయర్ని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంటుంది. ఆర్థికంగా స్థిరపడిన సామాజిక వర్గాలు తర తరాలుగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం వల్ల, నిజంగా వెనుకబడిన సమూహాలకు అవకాశాలు తగ్గుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని సమీక్షించడం ద్వారా రిజర్వేషన్ ఫలాల్ని అట్టడుగు వర్గాలకు అందించే ప్రయత్నం చేయవచ్చు.


రాష్ట్రాలకు ఓబీసీ జాబితాలను నిర్వహించే అధికారం 2021లో 105వ రాజ్యాంగ సవరణ ద్వారా పునరుద్ధరించబడింది, కానీ రాజ్యాంగం ప్రకారం జనగణన చేసే అధికారం కేంద్ర ప్రభుత్వం వద్దనే ఉంది.

ఓసీ మరియు బీసీల గుర్తింపు భారతీయ సమాజంలో సామాజిక న్యాయం, అవకాశాల కల్పనలో కీలకమైన అంశం. 1931 జనగణన ఆధారంగా అంచనా వేయబడిన జనాభా శాతాలు దాదాపు వందేళ్ళ క్రితం సేకరించబడినవి. ప్రతి జనగణన లో ఎస్సీ,ఎస్టీల జనాభా వివరాల్ని సేకరిస్తున్నప్పటికీ రాబోయే జనగణనతో పాటు చేసే కుల గణన ఈ అంతరాన్ని పూరించి, ఖచ్చితమైన గణాంకాల్ని(డేటా)తో, రిజర్వేషన్ విధానాలను మరింత సమర్థవంతం చేయగలదు. వివిధ రాష్ట్రాలలో కుల వర్గీకరణల సంక్లిష్టత, ఓటు బ్యాంకు రాజకీయాలు, మరియు క్రీమీలేయర్ వంటి సవాళ్లు సామాజిక న్యాయ సాధనలో అడ్డంకులుగా ఉన్నాయి.

వచ్చే జనగణన ఫలితాలు ఈ సవాళ్లను అధిగమించి, సమానత్వం, సామాజిక న్యాయ సాధనకు దోహదపడాలి.ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయి.

ఈ రోజుల్లో కూడా దేశ వ్యాప్తంగా ఓసి వర్గంలో కొన్ని కులాలు, బీసీ హోదాను, బీసీ వర్గంలో ఉన్న కులాలు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గంలో చేర్చమని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మీద ఒత్తిడి చేస్తున్న సంఘటనలు నిత్యకృత్యం అయ్యాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 ఏండ్లు అయినా అట్టడుగు ప్రజలకు ఇంకా పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందట్లేదు అంటే చట్టాలను పున సమీక్షించుకోవడం కన్నా ముందు క్షేత్ర స్థాయిలో వాటి అమలు తీరు పైన ప్రభుత్వాలు, పౌర సమాజం దృష్టి సారిస్తే సామాజిక న్యాయంతో పాటు సమసమాజం నిర్మితం అయ్యే అవకాశం ఉంటుంది.

**- యం. అర్జున్**



# ఊర్ల సురేష్‌కు చేనేత సంఘం సత్కారం

**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 07(మనం న్యూస్):** విజయవాడలో 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను అఖిల భారతీయ పద్మశాలీ సంఘం అద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేనేత కళా వెలుగు అనే అంశం పైన కవి సమ్మేళనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొని చేనేత కార్మికుల వెతల గురించి, దైనందిన జీవితంలో చేనేత మగ్గం అందిస్తున్న సేవల గురించి కవితలు రాసిన ఊర్ల సురేష్ కుమార్ కు ప్రసంశా పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. ఎపిసిపిడిసిఎల్ ముత్యాలంపాడు సెక్షన్ కార్యాలయంలో జూనియర్ ఇంజనీర్ గా పనిచేస్తున సురేష్ కుమార్ మాట్లడుతూ చేనేత అనేది భారత దేశ జీవనాడి అని తెలిపారు. మంగళగిరిలో తయారయ్యే చేనేత వస్త్రాలలో వందశాతం కాటన్ ఉంటుందని అన్నారు. అక్కడి వస్త్రాలకు అద్దే రంగులు కూడా ప్రకృతి సహజ సిద్దమయినవని అన్నారు. ఎటువంటి మిషన్లు చేయలేని విధంగా వారు సాంప్రదాయ బద్దంగా తయారు చేస్తున్నారని అన్నారు. వారసత్వంగా వస్తున్న చేనేతను అందరూ ఆదరించాలని కోరారు. చేనేత కళాకారులకు నానాటికి ఆదరణ తగ్గుతుందని ఆంధోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరూ చేనేత, హస్త కళల పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారతీయ పద్మశాలీ సంఘం అధ్యక్షులు తుమ్మ సత్యన్నారాయణ, కార్యదర్శి సూర్యపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పంటలకు మోతాదులో ఎరువుల వినియోగం కీలకం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు

**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 07(మనం న్యూస్):** అధిక మోతాదులో పంటలకు ఎరువుల వినియోగిస్తుండటం వల్ల చీడ పురుగులు, తెగుళ్ల ఉద్భతి పెరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు అన్నారు. యూరియా పై 88 శాతం, డిఎపి పై 50.72 శాతం రాయితీను ప్రభుత్వం భరిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్బంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ఢిల్లీ రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు కేవలం రసాయనిక ఎరువులను వినియోగిస్తూ వాటిని క్రమానుగతంగా పెంచుకుంటూ పోతున్నారని, ఇది మంచి పరిణామం కాదని రైతులకు తెలియచేశారు. రైతులు పాక్షికంగా వారు వినియోగిస్తున్న రసాయనిక ఎరువులలో కనీసం 20 నుండి 25 శాతం వరకు తగ్గించి వాటి స్థానములో సేంద్రీయ , పచ్చిరొట్ట, జీవన ఎరువులను, నూతన సాంకేతిక శ్రేణి నానో ఎరువులను వినియోగించి, నేల సారాన్ని రక్షించాలన్నారు. అధిక మోతాదులో పంటలకు ఎరువులు వినియోగిస్తుండటం వల్ల పంటలకు చీడ పురుగులు, తెగుళ్ల ఉధృతి ఎక్కువ అవటానికి




అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కింద తెలిపిన టేబుల్ లోని సమాచారం ప్రకారం ( టేబుల్ జత చేయబడినది) ప్రతి ఎరువు బస్తా అసలు ధర ,వాటిపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ,రాయితీపోను ప్రతి బస్తా గరిష్ట చిల్లర ధరను పేర్కొనటం జరిగింది. యూరియా విషయంలో 45 కిలోల బస్తా అసలు ధర రూ. 2234ల పడుతుంటే ప్రభుత్వం రూ. 1967ల రాయితీని 88 శాతం కల్పిస్తూ వాటి ధరను భరిస్తూ రైతులకు కేవలం రు.266.50 పైసలకు మాత్రమే యూరియా బస్తాను అందించటం జరుగుతున్నదని ,అదే దామాషాలో డిఎపి 50 కిలోల బస్తా అసలు ధర రూ. 2740/- ఉంటే ప్రభుత్వ రాయితీ రూ. 1390/- కల్పించడం జరిగిందని,రాయితీ పోను ఒక బస్తాను రూ.1350/- లకు రైతులకు మాత్రమే అందిస్తున్నామని తెలిపారు. యూరియా విషయంలో 88 శాతం, డిఎపి విషయంలో 50.72 శాతం రాయితీను భరించటం ద్వారా ఒక్క మన రాష్ట్రంలోనే అన్ని రకాల ఎరువులకు కలిపి రూ. 12500/- కోట్ల వరకు రాయితీను ప్రభుత్వం భరించటం జరుగుతున్నదని తెలిపారు. ప్రపంచ వాణిజ్య విధానాలలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురవుతున్న కూడా మన దేశంలోని రైతులు వ్యవసాయంలో మెరుగైన ఉత్పత్తులను సాధించటానికి ,పెరుగుతున్న జనాభాకి తగ్గట్లు ఆహార భద్రత కల్పిస్తూ ఆహార పోషక అవసరాల మేరకు అధికోత్పత్తి సాధించటానికి రసాయనిక ఎరువుల వినియోగంనకు బడ్జెట్లలో రాయితీలు కేటాయించి ఎరువులను సకాలములో అందించే ఏర్పాట్లు చేయడం జరుగుతున్నదని తెలిపారు. కాబట్టి ప్రస్తుత దేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రైతాంగం విచక్షణ రహితముగా ఎరువులను వాడకుండా సిఫారసుమేర వాడాలని కోరారు . దేశ ఆర్థిక భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని రైతులు తమ యొక్క వ్యవసాయ విధానములో ఎరువులను సమగ్ర సమర్థ వంతమైన పోషక యాజమాన్య పద్ధతులను ఆచరించటం అత్యంత అవసరం అని రైతులకు ప్రభుత్వం తెలియచేస్తున్నదని పేర్కొన్నారు.

# ప్రాణం ముద్దు.. పార్టీ వొద్దు: ఎమ్మెల్యే వీకే రాజా



**పామర్రు ఆగస్టు 7(మనం న్యూస్):** వైఎస్సార్సీపీ పార్టీకి చెందిన ముఖ్య కార్యకర్త మర్రిరెడ్డి వెంకట రెడ్డి భార్య ధనలక్ష్మి అనారోగ్య కారణాలతో బాధపడుతూ సీఎంఆర్ఎఫ్ కోసం టీడీపీ కార్యాలయంలో అర్జీ పెట్టుకోగా పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వర్ల కుమార్ రాజా దాతృత్వంతో పార్టీలు నాకు ముఖ్యం కాదు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సైతం ప్రభుత్వ ఫలాలు అందాలని ఆ అర్జిని సీఎం రిలీఫ్ ఫండ్ అధికారులతో మాట్లాడి వైసీపీ ముఖ్య కార్యకర్త అయిన మర్రిరెడ్డి ధనలక్ష్మి భర్త వెంకట రెడ్డి రూ. 69,800/-ల చెక్కును టీడీపీ కార్యాలయంలో అందించటం జరిగింది. గడిచిన 13 నెలలో పామర్రు నియోజకవర్గంలో 350 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించడం జరిగినది. గత కొన్ని నెలలుగా పార్టీలతో సంబంధం లేకుండా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి ఎమ్మెల్యే కుమార్ రాజా గారు స్వయంగా వారి చేతికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎల్ఓసీ



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 07(మనం న్యూస్):** ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఎల్ఓసీని గురువారం భవానీపురం ఎన్డీఏ కార్యాలయంలో కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి అందజేశారు. 43వ డివిజన్, ఊర్మిళానగర్ రెడ్డి కాలనీకి చెందిన ఆర్ నారాయణ రెడ్డి(69) ప్రోస్టేట్ గ్రంధి సమస్యతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తనకు మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఎన్డీఏ కార్యాలయంలో వైద్య సాయం కోసం దరఖాస్తు చేశారు. మంజూరైన రూ.1 లక్ష 80 వేల ఎల్ఓసీ పత్రాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. త్వరితగతిన ఎల్ఓసీ మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ మహిళా మోర్చా నేతలు బొమ్మదేవర రత్న కుమారి, కూటమి నేతలు ఆకారపు విజయ కుమారి, గన్నవరపు శ్రీనివాసరావు, మంగళపురి మహేష్, గడ్డిపాటి కిరణ్ పాల్గొన్నారు.

# తెలుగు వైభవ పురస్కారానికి జస్టిస్ ఎన్వీ రమణ ఎంపిక

- మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారం అందజేయనున్న బుద్ధప్రసాద్

**అవనిగడ్డ, ఆగస్ట్ 07(మనం న్యూస్):** భారతదేశ సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణకు 'మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం' ప్రదానం చేయనున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం అవనిగడ్డలోని తమ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సముపార్జనలో ఆఖరి ఘట్టమైన 1942వ సంవత్సరం ఆగస్ట్ 9న జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం భారతీయులందరికీ చిరస్మరణీయంగా నిలుస్తుందన్నారు. ఈ ఉద్యమంలో మహాత్మా గాంధీ పిలుపుతో ప్రభావితులైన మండలి వెంకట కృష్ణారావు విద్యార్థి దశలోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనటం ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేశారని తెలిపారు. నాటి నుంచి రాజకీయాల్లో మండలి వెంకట కృష్ణారావు ఎంపీ, ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రిగా ఇంకా అనేక పదవులు అలంకరించి రాజకీయ విలువలను కాపాడుతూ గాంధేయ మార్గంలో నిరాడంబర జీవితం గడపారని తెలిపారు. దేశంలో పెచ్చు పెరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా నినాదం స్ఫూర్తితో క్విట్ ఇండియా ఉద్యమం జరిగిన రోజున హైదరాబాదులో క్విట్ కరప్షన్ ఉద్యమాన్ని నిర్వహించారని తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు ప్రతి ఏటా ఆయన పేరుతో మండలి ఫౌండేషన్ ద్వారా తెలుగు జాతి వైభవానికి దోహదకారులైన ప్రముఖులకు 'మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం'తో సత్కరిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ పురస్కారం అంతర్జాతీయ ఖ్యాతి పొందిన గాన కోకిల పి.సుశీల, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ప్రముఖ రక్షణ రంగ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డిలకు అందించి గౌరవించినట్లు తెలిపారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం-2025 భారతదేశ సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కృష్ణాజిల్లాలోని ఒక కుగ్రామంలో జన్మించి పట్టుదల, కృషి, మేధాసంపత్తితో అంచెలంచెలుగా ఎదిగి భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా పదవి బాధ్యతలు నెరవేర్చిన న్యాయదేవత ముద్దుబిడ్డ, తెలుగువారు గర్వించే న్యాయ కోవిదుడు జస్టిస్ నూతలపాటి వెంకటరమణకు ఈ పురస్కారం అందించడం తమకెంతో గర్వకారణం అని తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4గంటలకు అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ అనంతరం మండలి కృష్ణరాయ వైభవం నృత్య రూపకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, మండలి అభిమానులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.



# ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట: రాఘవేంద్ర

- దోమల నివారణకు చర్యలకు శ్రీకారం
- మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర



**జగ్గయ్యపేట ఆగస్టు 7(మనం న్యూస్):** పట్టణంలో ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. జగ్గయ్యపేట పట్టణ పరిధిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ చైర్‌పర్సన్ స్పందించారు, వార్డులలో దోమల బెడద పెరిగి ఉన్నందున దోమల వృద్ధి నివారణకు పురపాలక సంఘ నిధుల నుంచి ఫాగింగ్ మిషన్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. గురువారం పురపాలక సంఘ కార్యాలయం నందు సదరు ఫాగింగ్ మిషన్ దగ్గరుండి ఆన్ చేయించి వాటి పని తీరును పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్నీ వార్డులలో దోమల మందు ఫాగింగ్ జరుగుతుందని తెలిపారు. ప్రజలు కూడా వారి వారి ఇంటి ప్రదేశాలను పరిశుబ్రంగా ఉంచుకొని దోమల వృద్ధిని అరికట్టుటకు వారి వంతు భాద్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.టి.వి. కృష్ణరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వి.శివ కోటేశ్వరరావు శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఐ/సీ) శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దసరా మహోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 07(మనం న్యూస్):** దసరా మహోత్సవాలకు శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 22 నుండి నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు దుర్గ గుడి అధికారులు చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వీకే శీనా నాయక్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి దుర్గా ఘాట్, జాతీయ రహదారి, మహా మండపం, కనక దుర్గ నగర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని, చేస్తున్న ఏర్పాట్ల పై అధికారులకు పలు సూచనలు చేశారు. గత ఉత్సవాలలో భక్తులకు ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పునరావృతం కాకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. మహా మండపం వద్ద ప్రసాదం క్యూ లైన్లను పరిశీలించి భక్తులకు అవసరమైన ప్రసాదాలను అందుబాటులో ఉండేలా చూడాలని ప్రసాదాల నాణ్యత, క్యూ లైన్ల వద్ద పరిశుభ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిషేదాన్ని ప్రకడ్బందిగా అమలు చేయాలని ఆదేశిస్తూ ప్రస్తుతం ఉన్న ప్రసాదం కౌంటర్లను, విక్రయిస్తున్న కవర్లను తనిఖీ చేసి బయోడిగ్రేడబుల్ కవర్లను విక్రయిస్తున్నందుకు కలెక్టర్ సంతోషం వ్యక్తం చేసారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన ముందస్తు భద్రతా ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ పరిసరాలు, క్యూ లైన్లు, ప్రసాదం పంపిణీ ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి వీకే శీనానాయక్ ఈ ఏడాది కనకదుర్గ నగర్ నందు 10 ప్రసాదం కౌంటర్లతో పాటు అదనంగా 8 చోట్ల మొత్తంగా 18 ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా ఆలయ పరిధి, వివిధ ప్రదేశాలలో 250కు పైగా సిసి కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్కు అనుసందానించి పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్కు వివరించారు. పరిశీలనలో కలెక్టర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి.ఎస్ఆర్ కోటేశ్వరరావు, డిఇలు రవీంద్ర, అశోక్లు ఉన్నారు.

## కనకదుర్గమ్మకు బంగారు ఆభరణాల బహుకరణ





**విజయవాడ , పశ్చిమ ఆగస్టు 7 (మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి విజయవాడ లోని ఆచార్య రంగ నగర్, బెంజ్ సర్కిల్కు చెందిన దాత శ్రీ పోసాని బసవయ్య, మనోహరమ్మ దంపతుల కుమారుడు శ్రీ ప్రసాదరావు విలువైన బంగారు ఆభరణాలను సమర్పించారు. అమ్మవారికి ముక్కుపుడక బొట్టు నత్తు వంటి మూడు బంగారు ఆభరణాలు సమర్పించారు. ఈ ఆభరణాలు 24.700 గ్రాముల బరువు కలిగి ఉన్నాయి. నవ రత్నాలతో కలిపి మొత్తం 30 గ్రాములు బరువుగా ఉన్నాయని పేర్కొన్నారు ఈ ఆభరణాల విలువ రూ3,05,000/- అని అంచనా వేయబడింది.

# విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన




**జగ్గయ్యపేట, ఆగస్టు 7(మనం న్యూస్):** విద్యార్థులు శక్తి యాప్‌పై అలానే డిజిటల్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని శక్తి టీం ఇన్చార్జ్ నందిగామ ఎస్ఐ అభిమన్యు తెలిపారు. గురువారం ఉదయం నందిగామ సబ్ డివిజన్ ఏసిపి, ఏబీజే తిలక్ ఆదేశాల మేరకు, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి వేంకటేశ్వర్లు నాయకత్వంలో, జగ్గయ్యపేట ఎస్సై జి రాజు సహకారంతో, నందిగామ శక్తి టీం ఇన్‌చార్జ్ ఎస్సై బి.అభిమన్యు జగ్గయ్యపేట పట్టణంలోని విశ్వ భారతి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు 'శక్తి యాప్'పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గంజాయి వాడకం, సేవించడం నేరము అని స్పష్టంగా తెలియజేయడంతో పాటు, డిజిటల్ అరెస్టు విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతేకాక, విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన జీవనశైలి గురించి సూచనలు అందించారు. శక్తి బృంద సభ్యులు భాగస్వాములైన వారిని ఉద్దేశించి పలు అంశాలపై వివరించారు.

# సూక్ష్మ సేద్యం.. కీలక ప్రగతి సూచిక

- ఉద్యాన రైతుల్లో విస్తృత స్థాయిలో అవగాహన పెంచండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 07(మనం న్యూస్):** వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో సాగునీటి యాజమాన్యం చాలా ప్రధానమైనదని.. సాగునీటి వనరుల సద్వినియోగంలో భాగంగా బిందు సేద్యం, తుంపర సేద్యంపై రైతులకు అవగాహన పెంచాలని, జిల్లాలో 2024-25 వరకు 23,937 హెక్టార్లు సూక్ష్మ సేద్యం కింద ఉందని.. 2025-26లో కొత్తగా 2,200 హెక్టార్లను ఈ విధానంలోకి తీసుకొచ్చేలా అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పథకం (ఎంఐపీ) కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్జిబిట్స్ కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. సూక్ష్మ సేద్యంపై అవగాహన పెంచేందుకు రూపొందించిన కరపత్రాలను, డ్రిప్, స్ప్రింకర్, రైన్ గన్లకు సంబంధించిన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సాగునీరు, కరెంటు వినియోగంలో 50 శాతం పొదుపుతో పాటు ఉన్న నీటితో ఎక్కువ విస్తీర్ణానికి నీరు అందించడం సూక్ష్మ సేద్యంతో సాధ్యమవుతుందని.. భూసారానికి, భూ సమతుల్యతకు ఎలాంటి హానీ కలగకుండా సాగువ్యయంలో దాదాపు 40 శాతాన్ని ఈ విధానంతో ఆదా చేసుకోవచ్చన్నారు. మామిడి, జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, కొబ్బరి వంటి పంటలతో పాటు కూరగాయలు, పూల తోటలకు కూడా సూక్ష్మ సేద్యం బాగుంటుందని.. డ్రిప్, స్ప్రింకర్ పరికరాలకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని వివరించారు. రైతు సేవా కేంద్రాలు, ఏపీ ఎంఐపీ కార్యాలయం ద్వారా వివరాలు పొంది, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల స్థూల జోడింపు విలువ (జీవీఏ)లో వృద్ధికి సూక్ష్మ సేద్యం విధానాలు కూడా ఉపయోగపడతాయని.. ఉపాధి హామీ పథకం సహాయంతో ఈ ఏడాది నాలుగువేల ఎకరాల్లో ఉద్యాన పంటలు వేయడం జరుగుతోందని, ఆయా రైతులను సూక్ష్మ సేద్యం దిశగా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ.. ఎంఐపీ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఏపీ ఎంఐపీ పీడీ పి.ఎం.సుభాని, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# కేంద్రం దృష్టికి ఆర్‌యూబీ అంశం

- మధురానగర్-వాంబే కాలనీ ఆర్‌యూబీ అంశం కేంద్రం దృష్టికి తీసుకువెళ్లిన ఎంపీ కేశినేని శివనాథ్

**ఢిల్లీ, ఆగస్టు 07(మనం న్యూస్):** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి ఎంపీ కేశినేని శివనాథ్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మధురానగర్- వాంబే కాలనీ మధ్య రెండు లైన్ల రైల్వే అండర్ బ్రిడ్జ్‌ను పూర్తిగా రైల్వే శాఖ నిధులతో నిర్మించేందుకు త్వరగా అనుమతులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. పార్లమెంట్ లోని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కార్యాలయంలో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ ఆయన్ను కలిసి అభ్యర్ధన పత్రం అందజేశారు. వాంబే కాలనీ, అజిత్సింగ్ నగర్ ప్రాంతాల్లో ఒక లక్షకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయని, దినసరి వేతనాలపై జీవించే వీరు ఉపాధి, వైద్యం, విద్య కోసం విజయవాడ నగరానికి వచ్చేందుకు పది కిలోమీటర్లు తిరిగి రావాల్సి వుంటుంది. వీరు దగ్గర మార్గంలో విజయవాడ వచ్చేందుకు ప్రధాన రైల్వే లైన్ అయిన చెన్నై-హౌరా హైస్పీడ్ లైన్ దాటుతున్నారు. ఈ సమయంలో చాలా మంది ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలందరూ భవన నిర్మాణ పనులు, వెల్డింగ్ వర్కర్స్ గా, వాషింగ్ వర్కర్లు గా, హోమ్ అటెండెంట్లుగా రోజూవారీ పనులు చేసుకుంటూ జీవిస్తారని చెన్నై-హౌరా హైస్పీడ్ రైల్వే లైన్ దాటే సమయంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం వలన వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలియజేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ అభ్యర్ధనపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించటమే కాకుండా రైల్వే శాఖ అధికారులకు మధు రానగర్-వాంబే కాలనీ మధ్య టూ లైన్ ఆర్వో బీ నిర్మాణంపై నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.



# బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 7(మనం న్యూస్):** బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బందెల గౌతం కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ పార్టీ స్టేట్ సెంట్రల్ కోఆర్డినేటర్ శ్రీ అతర్ సింగ్ రావు పాల్గొన్నారు విజయవాడ గాంధీ నగర్ ప్రముఖ హోటల్లో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టు కోవడంలో ప్రజా సమస్య లను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అతర్ సింగ్ విమర్శించారు ఈ పరిస్థితుల్లో కేంద్రంలోనూ రాష్ట్రంలో నూ ప్రత్యామ్నాయంగా బహుజన్ సమాజ్ పార్టీ ఎదుగుతుందని రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో ఖచ్చితమైన ఫలితాలను పార్టీ సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు ఇందు కోసం ఇప్పటి నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీని పటిష్టంగా నిర్మాణం చేయాలని ఆయన కోరారు అలాగే దేశంలో రాష్ట్రంలో బహుజనులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన నాయకు లను ఆదేశించారు అలాగే సెప్టెంబర్ 2వ తేదీ హైదరాబాద్ కు జాతీయ సమన్వయ కర్త ఆకాష్ ఆనంద్ హాజరయ్యే సదస్సును జయప్రదం చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని అయన కోరారు అలాగే పార్టీ నిర్మాణానికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జానకి ప్రసాద్ ప్రధాన కార్యదర్శులు బచ్చలకూర పుష్పరాజు గుమ్మాపు చిత్రసేను కోశాధికారి పెదపెంకి శివ ప్రసాద్ కార్యదర్శి చిందనూరు నాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలి

- **లేనిచో వారం రోజుల్లో సమ్మె తప్పదు**
- **బిఎల్ టీయు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్**

**నిజామాబాద్, ఆగస్టు 07 (మనం బ్యూరో) :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఔట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ (బిఎల్ టీయు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్ టీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ., ఎస్సీ, ఎస్టీ బిసి, మత మైనారిటీలకు చెందిన ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ, తమ ఆరోగ్యాలు బాగోలేకపోయినా తెల్లవారుజామున నాలుగు గంటలకు నిద్రలేచి నగర వీధులను, డ్రైనేజీలను శుభ్రం చేసే శానిటేషన్ కార్మికులు, జవాన్లు, డ్రైవర్లు మరోవైపు ఉదయం ఐదు గంటలకు నగర ప్రజలకు మంచి నీళ్లు సకాలంలో అందించే వాటర్ సప్లై కార్మికులు, వీధులను కాంతివంతంగా ఉంచే స్ట్రీట్ లైట్స్ కార్మికులు, ఉదయం ప్రజలు తమ ఆరోగ్యం కోసం వాకింగ్ చేసేందుకు పార్కులను పచ్చగా ఉంచే గార్డెన్స్ కార్మికులు ఈ విధంగా మున్సిపల్ కార్పొరేషన్లో వివిధ రకాలుగా సేవలు అందిస్తున్నా మున్సిపల్ కార్మికులు ఉన్నారన్నారు.ఇలాంటి



ఉన్నతమైన శ్రామికులకు చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పండగ సెలవులు, జాతీయ సెలవులు, అంబేడ్కర్ జయంతి, గాంధీ జయంతి, అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) నాడు కూడా సెలవులే లేని ఏకైక శ్రామికులు మున్సిపల్ కార్మికులే అన్నారు. ఇలాంటి శ్రామికుల సేవకు లక్ష రూపాయల వేతనం ఇచ్చినా తక్కువేనని అన్నారు. కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పును బుట్టదాఖలు చేసి మున్సిపల్ కార్మికుల శ్రమ దోపిడికి పాల్పడుతున్నాయని విమర్శించారు. గత సంవత్సరం నుండి మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎల్టీయూ) ఆధ్వర్యంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు అనేక సార్లు వినతులు సమర్పించిన స్పందించడంలేన్నారు.ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడంలో కార్పొరేషన్ వివక్ష చూపుతున్నందుకు నిరసనగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్లో ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ లకు వినతి పత్రం ఇవ్వాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ నిర్ణయంలో భాగంగా గురువారం ధర్నా నిర్వహించామన్నారు.

కార్మికులు ఎదుర్కొంటున్న 15 రకాల ససమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ సిద్ది రాములు, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్ టీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి మేకల రాజేందర్, నగర అధ్యక్ష, కార్యదర్శి వై. అనిల్ కుమార్, గంగా శంకర్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మణ్, నాయకులు నవీన్, జవాన్స్ యూనియన్ అధ్యక్షులు కె.వెంకటస్వామి, నాయకులు ప్రవీణ్,రాము, వాటర్ సప్లై యూనియన్ అధ్యక్షులు కొమ్ము రాహుల్, నాయకులు ఆర్. మురళి, శ్రీశైలం రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ కమిషనర్ రవి బాబు ను తక్షణమే సస్పెండ్ చేయాలని మున్సిపల్ కార్మికులు వర్షంలో తడుస్తుంటే ఆయన రెయిన్ కోట్ పైన కార్మికుడితో గొడుగు పట్టించుకొని ఒక పెత్తందారీ లాగా వ్యవహరించిన డిప్యూటీ కమిషనర్ విషయాన్ని బిఎల్ టీయూ నాయకులు ప్రశ్నిస్తే తాను డబ్బులిచ్చి నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు వచ్చానని చెపుతున్న విషయంపై జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గర్గుల్ పల్లె దవాఖానను సందర్శించిన జిల్లా కలెక్టర్..



**కామారెడ్డి రూరల్, ఆగస్టు 07 (మనం న్యూస్) :** కామారెడ్డి మండలంలోని గర్గుల్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లోని మౌలిక వసతులను, రోగులకు అందుతున్నటువంటి వైద్య సేవలను గురించి ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

ఆయుష్మాన్ ఆరోగ్య భవనానికి విద్యుత్ సరఫరా గురించి వెంటనే చర్యలు చేపట్టాలని, అలాగే నీటి వసతికి కావలసిన ఏర్పాట్లు చేయాలని గ్రామ కార్యదర్శిని, ఎంపీడీవోను ఆదేశించారు. రాత్రి వేళల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవన సముదాయ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు వారిని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి వచ్చే రోగుల ఔట్ పేషంట్ వివరాలు రోజువారీగా నివేదికలు రిజిస్టర్ లో (సంగ్రహము) అబ్స్ట్రాక్ట్ రూపంలో వ్రాసి పెట్టాలని సూచించారు.

కావలసిన మౌలిక సదుపాయాల గురించి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. చంద్రశేఖర్, జిల్లా ఉపవైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి దోమకొండ డాక్టర్ ప్రభు దయా కిరణ్, మండల వైద్యాధికారి డాక్టర్ జోహర్ ఇతర వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్, ఆగస్టు 07 (మనం బ్యూరో) :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీరాంసాగర్ పరీవాహక ప్రాంతంతో పాటు నదులు, వాగుల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ప్రజలకు సూచించారు. అవసరం అయితే



తప్ప ఇళ్ల బయటకు ఎవరూ రాకూడదని హితవు పలికారు. చేపల వేట, ఈత సరదా కోసం చెరువులు, కాల్వలు, కుంటలు, ఇతర జలాశయాల వద్దకు వెళ్లకూడదని సూచించారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, తక్షణ పర్యవేక్షణ చేపట్టాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల వల్ల ఎక్కడైనా ప్రమాదం ఎదురైనా, లేక అత్యవసర పరిస్థితులు ఏర్పడి సహాయక చర్యలు అవసరమైన పక్షంలో కలెక్టరేట్ లో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08462 - 220183 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని సూచించారు.

# సమన్వయంతో పనిచేస్తూ మంచి ఫలితాలను సాధించాలి



రాష్ట్ర ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న

**నిజామాబాద్, ఆగస్టు 07 (మనం బ్యూరో) :** అధ్యాపకులు సమన్వయంతో పనిచేస్తూ మంచి ఫలితాలను సాధించాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న ఆదేశించారు. గురువారం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రభుత్వ కళాశాలలో చేరిన విద్యార్థుల అభ్యున్నతికి అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నందున యూనిట్ టెస్టులను నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శ్రద్ధ వహించాలన్నారు. ఇంటర్ బోర్డు సూచించిన టైం టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించాలని, ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని ఆదేశించారు. కళాశాలకు గైర్హాజరయ్యే విద్యార్థుల సమాచారం తల్లిదండ్రులకు అందజేసే ప్రక్రియను ప్రయోగాత్మకంగా జిల్లా నుంచి ప్రారంభించాలని తెలిపారు. అలాగే మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, అధ్యాపకులు ఉన్నారు.

## రుణాల పంపిణీలో ప్రొటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు

**భీంగల్, ఆగస్టు 07 (మనం న్యూస్) :** మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వడ్డీ రాయితీ రుణాల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్ కుమార్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు అధికార పార్టీకి చెందిన నాయకులను ఆహ్వానించి వారితో కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్నారన్నారు. దినపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారాలను ఫిర్యాదుతో జత చేశామన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ మాట్లాడుతూ., రాజకీయ నాయకులను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించి ప్రొటోకాల్ విస్మరిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఐకేపీ అధికారుల తీరుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట గంగాధర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర నర్సయ్య, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారి లక్ష్మణ్ గౌడ్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు రమావత్ వెంకటేష్, శక్తి కేంద్ర ప్రముఖ్ హరిప్రసాద్, లక్ష్మీ నారాయణ, బీజేవైఎం నాయకులు శెట్టి ప్రేమ్ చంద్, పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలి



- **కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, ఆగస్టు 07 ( మనం ప్రతినిధి ) :** కామారెడ్డి పట్టణంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కామారెడ్డి పట్టణంలోని రాజా నగర్ కాలనీలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా బెస్ట్ మెట్ వరకు నిర్మాణం పూర్తయినదానికి బిల్లులు మంజూరు అయ్యాయా?ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని లబ్ధిదారును అడిగి ఎలాంటి సమస్య రాకుండా ప్రభుత్వం ఉచితంగా ఇసుక, మొరం అందజేస్తదని రవాణా ఖర్చులు పెట్టుకొని వాటిని తీసుకుని వచ్చి నాణ్యతగా ఇల్లు నిర్మించుకోవాలని అన్నారు. నిర్మాణం పూర్తయిన ఇంటి వివిధ స్టేజీలను బట్టి బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక, మొరం, ఇతర నిర్మాణ సాగుమాగ్రికి ఎలాంటి సమస్య తలెత్తకుండా రెగ్యులర్ గా పర్యవేక్షించాలని హౌసింగ్ పీడీ విజయ్ పాల్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి లను ఆదేశించారు. మార్కౌట్ చేసి నిర్మాణం ప్రారంభమైన అన్ని ఇందిరమ్మ ఇంట్లో వేగంగా నిర్మాణం పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

**జాతీయం- అంతర్జాతీయం**

## చేయని నేరానికి 20 ఏళ్లు జైల్లోనే..

### రూ.11 కోట్ల పరిహారం... ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయం

**సిడ్నీ, ఆగస్టు 7:** తన నలుగురు పిల్లలను పొట్టన పెట్టుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు క్రూరమైన 'మహిళా సీరియల్ కిల్లర్ 'గా ముద్రపడిన ఓ ఆస్ట్రేలియన్ మహిళకు ఇటీవల విముక్తి లభించింది. శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా తన చిన్నారులను ఆమె హత్య చేయలేదని తేలడంతో కొంతకాలం క్రితం ఆమె విడుదలైంది. ఈ క్రమంలో పరిహారంగా ఆమెకు 2 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, బాధిత మహిళ తరఫు న్యాయవాది మాత్రం ఇంత తక్కువ పరిహారం చెల్లించడం చాలా అన్యాయమన్నారు. న్యూసౌత్ వేల్స్కు చెందిన కాథ్లీన్ ఫోల్బిగ్కు ఇద్దరు





కుమారులు, ఇద్దరు కుమార్తెలు. 1989-99 మధ్య కాలంలో ఈ నలుగురూ ఆకస్మికంగా మృతి చెందారు. అయితే, కన్నతల్లే వారిని హత్య చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆమె తన డైరీలో పిల్లల పెంపకం, కష్టాలపై రాసిన రాతలు, ఇతరత్రా సాక్ష్యాల ఆధారంగా 2003లో ఆమెకు 30ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, తాను ఏ తప్పు చేయలేదని ఆమె న్యాయ పోరాటం చేశారు. ఈ క్రమంలోనే 2021లో ఓ రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో ఈ కేసును మరోసారి దర్యాప్తు చేశారు. ఆ నలుగురు చిన్నారులు సహజంగానే మరణించి ఉండొచ్చనే అభిప్రాయానికి వచ్చారు. 90 మంది శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, సంబంధిత నిపుణులు కూడా ఇందుకు మద్దతు పలికారు. దీంతో చివరకు 2023 డిసెంబర్లో న్యూ సౌత్ వేల్స్ కోర్టు ఆమెపై నమోదైన అభియోగాలను రద్దు చేయడంతో ఆమె విడుదలైంది. ఈ నేపథ్యంలోనే 20లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లను ఆమెకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, రెండు దశాబ్దాలు జైల్లో ఉండి, నలుగురు పిల్లలను కోల్పోవడంతోపాటు ఆస్ట్రేలియన్ సీరియల్ కిల్లర్గా అపఖ్యాతి మూటగట్టుకున్న ఆమెకు ఈ పరిహారం చాలా తక్కువేనని బాధిత మహిళ తరఫు న్యాయవాదులు, మద్దతుదారులు వాదిస్తున్నారు. సుమారు కోటి డాలర్లు పరిహారం ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు.

# ఆరు నెలల్లో 529 బాంబింగ్లు.. నోబెల్ ఇవ్వాల్సిందే..!

**వాషింగ్టన్, ఆగస్టు 7 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం నానాతంటాలు పడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడ చిన్న ఘర్షణ జరిగినా.. అక్కడ వాలిపోయి పంచాయితీలు చేస్తున్నారు. ఆయనను ఒక శాంతి దూతగా చిత్రీకరించేందుకు శ్వేత సౌధంలోని కార్యవర్గం కిందామీదా పడుతోంది. అసలు ట్రంప్నకు నోబెల్ బహుమతి వచ్చే అవకాశం ఉందా..? ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయోగించిన బాంబులు ఎన్ని.. ఎంత మంది ప్రాణాలను ఫణంగా పెట్టారో తెలుసా..?

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో నోబెల్ విషయంలో ట్రంప్నకు వైరం కొనసాగుతోంది. ట్రంప్ తొలిసారి అధ్యక్ష పదవి చేపట్టడానికి ప్రయత్నాలు మొదలుపెట్టినప్పటి నుంచి ఒబామాతో విభేదాలు ఉన్నాయి. తన శత్రువు అధ్యక్ష పదవి చేపట్టిన 9 నెలల్లోనే నోబెల్ శాంతి బహుమతి అందుకోగా లేనిది తన విషయంలో ఎందుకు సాధ్యం కాదని ట్రంప్ అనుకొంటున్నారు. ఒబామాకు బహుమతి రావడంపై కూడా బహిరంగంగానే కొన్నేళ్ల నుంచి అక్కసు వెళ్లగక్కుతున్నారు. 2019లో ఓ సందర్భంలో మాట్లాడుతూ బరాక్ ఒబామాకు ఎందుకు వచ్చిందో నాకు తెలియదు.. మీకేమైనా తెలుసా..?'' అని వ్యాఖ్యానించారు.

ట్రంప్ ఆశలకు గండికొట్టే అంశాలు కూడా బలంగానే ఉన్నాయి. జనవరి 20న పగ్గాలు చేపట్టిన నాటి నుంచి జులై 15 నాటికి కేవలం ఆరు నెలల వ్యవధిలో ఆఫ్రికా, పశ్చిమాసియా, మధ్య ఆసియాలోని 240 ప్రదేశాల్లో 529 బాంబింగ్లను





ట్రంప్ చేయించారు. ఈ విషయాన్ని 'ఆర్మ్డ్ కాన్ఫ్లిక్ట్ లొకేషన్ అండ్ ఈవెంట్ డేటా' గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అదే ఆయన కంటే ముందు అధికారంలో ఉన్న జోబైడెన్ నాలుగేళ్లలో 555 బాంబింగ్లను చేయించారు. ఇరాన్పై అతిపెద్ద బంకర్ బస్టర్ల వర్షం కురిపించారు.

పేద దేశాల్లో అన్నార్తులకు ఆహారం అందించే యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్ నిధులకు భారీగా కత్తెరేశారు. దీంతో 2030 నాటికి 14 మిలియన్లు (1.4 కోట్లు)మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయే ముప్పు పొంచి ఉందని ప్రముఖ మెడికల్ జర్నల్ 'లాన్సెట్' ఇటీవల తన అధ్యయనంలో అంచనావేసింది. వాస్తవానికి అమెరికాలో ఒక్కో వ్యక్తి సగటున రోజుకు 18 సెంట్లు యూఎస్ఎయిడ్కు ఇస్తారు. (100 సెంట్లు ఒక డాలర్) ట్రంప్ దానిని ఆదా చేసేందుకు 1.4 కోట్ల మంది ప్రాణాల మీదకు తెచ్చారు.


మూడు సార్లు తిరస్కరణలకు గురైనా నామినేషన్లు..

ఇదంతా ఒక ఎత్తైతే.. ట్రంప్ పట్టు వదలని విక్రమార్కుడిలా నోబెల్కు నామినేషన్లు పంపిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఆయనవి మూడుసార్లు తిరస్కరణకు గురయ్యాయి. 2018లో అణు నిరాయుధీకరణ యత్నాలకు ఇద్దరు నార్వే ప్రజాప్రతినిధులు, 18 మంది రిపబ్లికన్ సభ్యులు ఆయన పేరును ప్రతిపాదించారు. నాడు ఉత్తర కొరియా, అమెరికా మధ్య చర్చలను దీనికి కారణంగా చూపారు. కానీ, బహుమతి రాలేదు. 2020లో మరోసారి ట్రంప్ బృందం నోబెల్ యత్నాలు చేసింది. పశ్చిమాసియాలో అబ్రహం ఒప్పందాలు చేయించినందుకు ఓ స్వీడిష్ చట్టసభ సభ్యుడు, కొందరు ఆస్ట్రేలియా లా ప్రొఫెసర్లు, ఫిన్లాండ్ చట్టసభ సభ్యుడు, ఐరోపా పార్లమెంట్ సభ్యుడు ఆయన పేరును ప్రతిపాదించారు. అప్పుడు కూడా నోబెల్ మొహం చాటేసింది. ఇక 2024లో ఆయన అధ్యక్ష పదవి చేపట్టేందుకు సిద్ధమైన వేళ కూడా ఆయన పేరును కాంగ్రెస్ ఉమెన్ క్లాడియా టెన్ని నోబెల్కు నామినేట్ చేశారు. అయినప్పటికీ ఈ సారికూడాట్రంప్ను నోబుల్ వరించలేదు.

## బీహార్లో ట్రంప్!

### సమస్తిపూర్లో నివాస ధ్రువీకరణ పత్రం

**సమస్తిపూర్, ఆగస్టు 7:** బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ పేరుతో నివాస ధ్రువీకరణ పత్రం కోసం వచ్చిన దరఖాస్తు సోషల్ మీడియాలో హాట్టాపిక్గా



फॉर्म/Form - XII
निवास प्रमाण पत्र हेतु आवेदन पत्र
मोहिउद्दीन नगर, अनुमंडल - पटोरी, जिला - समस्तीपुर, बिहार
5 आवेदन की तिथि : 29/07/2025
: ऑनलाइन / Online
: डोनाल्ड जॉन ट्रम्प (Donald John Trump)
: पुरुष / Male
: फ्रेडरिक क्राइस्ट ट्रम्प (Frederick Christ Trump)

మారింది. జిల్లాలోని మొహియుద్దీన్ నగర్ బ్లాకు ప్రభుత్వ పోర్టల్లో ట్రంప్ పేరు, ఫొటోతో ఈ దరఖాస్తు ప్రత్యక్షమైంది. అధికారులు అప్రమత్తమై అభ్యర్థనను వెంటనే తిరస్కరించారు. ఐటీ చట్టం కింద కేసు నమోదుచేసి, సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బీహార్లో గత కొన్నిరోజులుగా ఇటువంటి 'అపహాస్య' దరఖాస్తులతో అధికారుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. మొదట కుక్క పేరుతో దరఖాస్తు రాగా, ఆ తర్వాత ట్రాక్టరు.. ఇప్పుడు ట్రంప్ దొరికారు.

## సువేందు అధికారి కన్వాయ్పై దాడి

- **బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం**

**ఢిల్లీ, ఆగస్టు 7 :** పశ్చిమ బెంగాల్లో ప్రతిపక్ష నేత, బీజేపీ కీలక నేత సువేందు అధికారి కన్వాయ్పై ఇటీవల జరిగిన దాడి ఘటనపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూచ్ బెహర్లో ఆయన కన్వాయ్పై టీఎంసీ గూండాలు దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ దాడి పోలీసుల సమక్షంలోనే జరగడం ఇంకా ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ ఘటన మమతా బెనర్జీ ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనడానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం ఒక ప్రజాప్రతినిధిపై జరిగిన దాడి కాదు.. ప్రజాస్వామ్యంపైనే జరిగిన దాడిగా అభివర్ణించారు. తాను సువేందు అధికారికతో మాట్లాడి ఆయన పరిస్థితి గురించి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. బెంగాల్లో ఒక ప్రతిపక్ష నేతకే రక్షణ లేకపోతే.. ఇంకా సామాన్య ప్రజల దుస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక, రాజకీయ హింసాత్మక ఘటనలకు మమతా బెనర్జీ జవాబుదారీగా ఉండాలన్నారు. మరోవైపు, ఇటీవల బీజేపీ ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా మంగళవారం సువేందు అధికారి జిల్లా ఎస్పీకి మెమోరాండం ఇచ్చేందుకు వెళ్తుండగా అనుమానిత తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఆయనకన్వాయ్పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయన వాహనం ధ్వంసమైంది. ఈ ఘటనలో మంత్రి ఉదయాన్ గుహాతో పాటు మొత్తం 41 మంది వ్యక్తులపై బీజేపీ ఫిర్యాదు చేసింది. ఇప్పటివరకు పోలీసులు కూచ్ బెహర్లో పలుచోట్ల ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

## అమెరికాపైనా ప్రతీకార సుంకాలు విధించాలి

### కాంగ్రెస్ నేత శశిథరూర్

**ఢిల్లీ, ఆగస్టు 7 :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా దిగుమతులపై కూడా భారత ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా విధించిన సుంకాలు మనపై కచ్చితంగా ప్రభావం చూపిస్తాయన్నారు. దాదాపు 90 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. సుంకం ఎక్కువగా ఉన్నప్పుడు భారత్ వస్తువులు ఎందుకు కొనాలి అని కొనుగోలుదారులు కూడా ఆలోచిస్తారన్నారు. రష్యా నుంచి భారత్ కంటే చైనా ఎక్కువ చమురు కొనుగోలు చేస్తోందని.. కానీ, ఆ దేశానికి ట్రంప్ సుంకాల నుంచి 90 రోజుల ఉపశమనం కల్పించారన్నారు. మనకు మాత్రం మూడు వారాలే ఉపశమనం కల్పించడం సమంజసం కాదన్నారు. కేంద్రం కూడా యూఎస్ దిగుమతులపై 50శాతం సుంకం విధించాలని కోరారు. మరే దేశం కూడా మనపై ఇలా బెదిరింపులకు దిగకూడదన్నారు.

# రాజనీతిజ్ఞుడు తెలుగు భాష సంస్కృతి పరిరక్షకుడు కృష్ణదేవరాయలు

- **జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను**



**విజయవాడ ఆగస్టు 7 మనం న్యూస్:** శ్రీకృష్ణదేవరాయలు మంచి పరిపాలన అధ్యక్షుని గా రాజనీతిజ్ఞుని గా తెలుగు భాషా సంస్కృతి పరిరక్షణకు ఎనలేని కృషి చేశారని ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను అన్నారు. శ్రీ కృష్ణ దేవరాయలు వారి 516 వ పట్టాభిషేకం మహోత్సవ కార్యక్రమం లో పాల్గొన్నసామినేని ఉదయభాను ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయవాడ, శ్రీ బాలాజీ పుష్కర ఘాట్ నందు రాయలసేన టీమ్ వారి అధ్వర్యంలో కుల, మతాలకు అతీతంగా ఏర్పాటు చేసిన దక్షిణ భారత చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు వారి 516 వ పట్టాభిషేకం మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు మంచి పరిపాలనాదక్షుడు అని, 1509 నుండి 1529 వరకూ శ్రీకృష్ణదేవరాయలుగా మంచి పరిపాలన అందించారని, రాజనీతిజ్ఞుడుగా, కవిగా శ్రీకృష్ణదేవరాయలు పేరు ప్రఖ్యాతులు గడించారని అన్నారు. తెలుగుభాష సంస్కృతి పరిరక్షణకు ఎనలేని సేవలు అందించారని, నేటి విద్యార్థులకు చరిత్ర, సంస్కృతి పై అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని అన్నారు. తిమ్మరుసు మంత్రిగా, అల్లసాని పెద్దన్న, తెనాలి రామకృష్ణ మొదలగు ఎనిమిది మంది దిగ్గజాలతో భువన విజయాన్ని చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసేన ప్రతినిధులు పోరుమామిళ్ల ఈశ్వర్ , ఆకుల శ్రీనివాసరావు , జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు , జనసేన పార్టీ కృష్ణా పెన్నా మహిళా రీజనల్ కో-ఆర్డినేటర్ రావి సౌజన్య , జనసేన పార్టీ నగర నాయకులు తిరుపతి అనూష , కృష్ణ పెన్నా రీజియన్ కోఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి , జనసేన నాయకులు డాక్టర్ కొండవీటి సంతోష్ కృష్ణ , ఉమ్మడి జిల్లా సెక్రెటరీ బంద్రెడ్డి రవి , జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ నాయకులు తిరుపతి సురేష్ , అనూష , రుద్ర శేఖర్ నాయుడు జనసేన పార్టీ నగర ఉపాధ్యక్షులు కామళ్ల సోమనాథం , పండలనేని గోపాల్ , ఉమ్మడిశెట్టి కృష్ణ తో పాటుగా రాయలసేన టీమ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో పార్కులను అభివృద్ధి చేయండి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ ఆగస్టు 7( మనం న్యూస్ ):**కొత్త పార్కులకు ప్రణాళికలు సిద్ధం చెయ్యండి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం నగరంలోని పార్కులను అభివృద్ధి చేసి కొత్త పార్కులకు ప్రణాళికలను సిద్ధం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ ధ్యానచంద్ర హెచ్ ఎం అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్ కృష్ణలంక పటమట పి సి ఆర్ జంక్షన్ ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించార స్క్రాప్ పార్క్ ను సందర్శించి పార్కులను అభివృద్ధి చేయాలని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ఆహ్లాదకరమైన పార్కులను ఏర్పాటు చేయాలని, తీమ్ పార్కుల నిర్మాణం కోసం ప్రణాళికను రూపొందించాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్ని ఆదేశించారు. నగర పరిధిలోని రోడ్డు లలో గుంతలు లేకుండా చూసుకోవాలని, ప్యాచ్ వర్క్స్ ఎప్పటికప్పుడు వేస్తూ, గుంతలు లేని నగరంగా ఉంచాలని ఇంజనీరింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు తదుపరి పటమట లోని అన్న క్యాంటీన్ను పరిశీలించారు ఎల్లప్పుడూ అన్న క్యాంటీన్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, వ్యర్థ నిర్వహణ ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె అర్జునరావు పర్యవేక్షణ ఇంజనీర్లు పిసత్యనారాయణ పి సత్యకుమారి ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరెడ్డి జె శ్రీనివాస్ జి.సామ్రాజ్యం అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ డాక్టర్ అన్నపూర్ణ బయాలజిస్ట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సబ్ జానియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో ఐదు పతకాలు



**పాల్వంచ, ఆగష్టు 7(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అద్వర్యంలో జనగామలో బుధవారం ముగిసిన రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటిలలో భద్రాద్రి కొత్తగుడెం జిల్లా అథ్లెట్లు 15 మంది పాల్గొని ఐదు పతకాలు సాధించారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మహీధర్ తెలిపారు. ఇందులో 2 బంగారు పతకాలు, 1 రజిత పతకం, 2 కాంశ్య పతకాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరి సారంగపాణి, జాతీయ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహిత నాగపురి రమేశ్ విజేతలు, కోచ్ లు నాగేందర్, ప్రసాద్, శ్వేత, మల్లికార్జున్, వీరభద్రం లను అభినందించారు.

# సహజ సిద్ధమైన రాఖీలతో రక్షాబంధన్ నిర్వహించుకోవాలి

- **జిల్లా కలెక్టర్ పమేల సత్పతి**



**కరీంనగర్ ఆగస్టు 7(మనంప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ తొ తయారు చేసినవి కాకుండా సహజ సిద్ధమైన రాఖీలను కట్టి రక్షాబంధన్ వే డుకలు నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేల సత్పతి తెలిపారు. రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని యువ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆవరణలో (ఎకో ఫ్రెండ్లీ రాఖి ) పర్యావరణహిత రాఖి కలెక్టర్ పమేలా సత్పతి కీ రాఖీ కట్టి అందించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేల సత్పతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చిగ్రామీణ ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి వినాయకులను ప్రతిష్టించి రసాయనలతో తయారైన ప్రతిమలతొ ఎంతో ప్రమాదకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ స్వచ్చంద సంస్థ అధ్యక్షులు రాష్ట్ర ఉత్తమ యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జక్కని సాయిరాం3, సభ్యులు గొట్టే ముక్కుల సుష్మిత రెడ్డి,గోపు కిరణ్మయి రెడ్డి, సాహితి, సాత్విక పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రాల నెపంతో గ్రామస్తుల దాడి

### యువకుడి మృతి

**ఆళ్లపల్లి, ఆగష్టు 7(మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలోని బూసరాయి గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. మంత్రాల నెపంతో మడకం బీడ(35)పై గ్రామస్తులు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్ర గాయాల పాలై యువకుడు మృతిచెందాడు. ఇది పూర్తిగా గొత్తికోయల గ్రామం. మంగళవారం ఓ మహిళ మృతిచెందింది. రాజు మంత్రాలు చేస్తుండడంతోనే మహిళ మృతిచెందిందని కొంతమంది గ్రామస్తులు భావించారు. యువకుడిపై దాడి చేయడంతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న సిఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ సోమేశ్వర్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# గిరిజన బహుళార్థ సాధక మార్కెటింగ్ కేంద్రాలతో ప్రయోజనమేంటి?

తెలంగాణలో దీర్ఘకాలింగా పనిచేసేందుకు తీసుకుంటున్న చర్యలు
లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
లిఖితపూర్వక సమాధానమిచ్చిన కేంద్ర మంత్రి దుర్గాదాస్ ఉయికె



**ఖమ్మం, ఆగష్టు 7(మనం న్యూస్):** నూతనంగా 100 గిరిజన బహుళార్థ సాధక మార్కెటింగ్ కేంద్రాల స్థాపన ద్వారా గిరిజన వర్గాలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి గురువారం లోక్ సభలో ప్రశ్నించారు. తెలంగాణలో ఈ కేంద్రాలు దీర్ఘకాలికంగా పనిచేసేందుకు అనుసరిస్తున్న ప్రణాళిక ఏంటని అడిగారు. దీనికి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఊయికె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గిరిజన వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం..గిరిజన బహుళార్థ సాధక మార్కెటింగ్ కేంద్రా( టిఎంఎంసీ)లు ఆచరణలోకి తెచ్చినట్లు మంత్రి తెలిపారు. గిరిజనుల ఉత్పత్తుల విక్రయానికి, మంచి మార్కెటింగ్ కేంద్రంగా ఉండాలని యోచిస్తున్నట్లు తెలిపారు. పంట కోత తర్వాత ఉత్పత్తి నష్టాలను తగ్గించడం, స్థానికంగా లభించే ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడం, గిరిజన ఉత్పత్తిదారులకు సమిష్టి మార్కెటింగ్, రైతుల మధ్య మంచి సంబంధాలను ప్రోత్సహిస్తూ నూతన అవకాశాలను కల్పించడం లక్ష్యమని తెలిపారు. మార్కెట్ లింకేజీల ఏర్పాటు ద్వారా తెలంగాణతో సహా ఇలా ముందుకు..గిరిజన ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించేలా చూస్తామని కేంద్ర సహాయ మంత్రి తెలిపారు. తెలంగాణతో సహా అన్ని రాష్ట్రాల్లో.. అక్కడి ప్రభుత్వాల సహకారం తీసుకుంటూ దీర్ఘకాలికంగా ప్రభావవంతంగా పనిచేసేలా.. ప్రణాళికతో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ముందుకు వెళుతున్నట్లు వివరించారు.

## అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి

### కేంద్ర బృందం సభ్యులు



**పాల్వంచ, ఆగష్టు 7(మనం న్యూస్):** పాయకారి యానంబైలు గ్రామపంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కేంద్ర బృందం గురువారం పర్యటించింది. కేంద్ర బృందం సభ్యులు కె. జయంత్, ఎస్.రవిచంద్ర (రీసెర్చ్ ఇన్వెస్ట్ గేటర్స్) పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ప్రభుత్వ కార్యాలయాలు, గుడి/ చర్చి, గ్రామంలో పారిశుద్ధ్యం, చెత్త సేకరణ మరియు నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం, చేతుల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యల లో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి, ఎస్ బి ఎం కన్సల్టెంట్ రేవతి, ఎంపీఓ చెన్నకేశవరావు, ఏపీవో పోరండ్ల రంగా, టెక్నికల్ అసిస్టెంట్ సైదులు, కార్యదర్శులు మధు, శ్రీనివాస్, బాబురావు, దేవ్ సింగ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాల గౌరవం ఎప్పటికీ తగ్గదు



- **నేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం**
- **చేనేత కార్మికులకు హెల్త్ క్యాంపులు**
- **కార్మికులందరికీ హెల్త్ కార్డులు, బీమా**
- **జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, ఆగస్టు 7(మనంప్రతినిధి):** చేనేత వస్త్రాల గౌరవం ఎప్పటికీ తగ్గేది కాదని, నేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు నేత కార్మికులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఈ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చేనేత కార్మికులకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఉచిత పరీక్షలు చేయిస్తామని అన్నారు. ప్రతి కార్మికునికి ఆరోగ్య కార్డు అందించి సంవత్సరంలో నాలుగు సార్లు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ ద్వారా పది లక్షల రూపాయల ఉచిత వైద్య సహాయాన్ని కూడా పొందవచ్చని తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో చేనేత మహిళా కార్మికులు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభించే బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి మాత్రలు తీసుకోవాలని అన్నారు. నేత కార్మికులు కోరిన రుణాలు, గురుకులాల్లో వారి పిల్లలకు సీట్లు కేటాయింపు వంటి అంశాలను ప్రభుత్వానికి విన్నవిస్తామని అన్నారు. నేత కార్మికుల్లో అర్హులు ఉంటే కచ్చితంగా ఇందిరమ్మ మంజూరు చేస్తామని అన్నారు.

అనంతరం జిల్లా నుండి చేనేత పురస్కారాలు అందుకున్న పలువురు నేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. చేనేత కార్మిక సంఘాలకు రుణాల మంజూరు చెక్కులు అందజేశారు. కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శనను కలెక్టర్ సందర్శించి నేత వస్త్రాలను పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన సాంప్రదాయ చేనేత మగ్గాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్, పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు వాసాల రమేష్, వివిధ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పద్మశాలి సంఘం నాయకులు, నేత కార్మికులు పాల్గొన్నారు


# జల్ జీవన్ మిషన్ స్కీం పర్యవేక్షణ పట్ల శ్రద్ధ వహించాలి



- **కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్**

**ఖమ్మం, ఆగష్టు 07(మనం బ్యూరో):** జల్ జీవన్ మిషన్ పథకం కింద సృష్టించిన మౌళిక వసతుల కల్పన పనుల పురోగతి నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ పై తెలంగాణ, ఝార్ఖండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ పథకాలను పర్యవేక్షించేందుకు డాష్ బోర్డు ఏర్పాటు చేశారని, దీనికి సంబంధించిన లాగిన్ వివరాలను జిల్లా కలెక్టర్లు తీసుకుని వారి పరిధిలోని పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. దిశ సమావేశాలు రెగ్యులర్ గా నిర్వహించి జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్‌పై సమీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశాల మినెట్స్ కాపీలను ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. తాగునీటి సరఫరా సోర్స్ బలోపేతం, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు తాగు నీటి సరఫరా వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈఓ, ఈఈ మిషన్ భగీరథ లాగిన్ క్రియేట్ చేయడం జరిగిందని, గతి శక్తి కింద 2,571 కి.మీ. పనులు పూర్తి చేశామని అన్నారు. దిశ సమావేశాలు రెగ్యులర్ గా జరుగుతున్నాయని అన్నారు. తాగు నీటి బల్క్ సరఫరా పనులు పూర్తి అయ్యాయని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో తాగు నీటి సరఫరా పనులు కాకపోతే కొత్తగా మంజూరు చేసేందుకు అవకాశం పరిశీలించాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రాల్లో త్రాగునీటికి సంబంధించి ఎటువంటి పెండింగ్ పనులు ఉన్నా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు.ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఇ శేఖర్ రెడ్డి, ఇఇ పుష్పలత, వాణిశ్రీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి



- **అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**ఖమ్మం, ఆగష్టు 7(మనం బ్యూరో):** చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన వేడుకలలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ చేనేత కార్మికులు ఉన్న ప్రాంతంలో తాను చిన్నతనంలో ఉన్నానని, మగ్గం వేయాలంటే చాలా ఓపిక ఉండాలని అన్నారు. రాష్ట్రంలో గద్వాల, నారాయణ పేట, సిరిసిల్ల వంటి ప్రాంతాల్లో మంచి నైపుణ్యత కలిగిన చేనేత కార్మికులు ఉన్నారన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో అగ్గిపెట్టెలో పట్టే చీర తయారు చేసే నాణ్యత గల చేనేత కార్మికులు కూడా ఉన్నారని అన్నారు. మన ముందుతరాలకు కూడా చేనేత వృత్తి పట్ల ఆకర్షితులయ్యేలా చూడాలని, మారుతున్న కాలాన్ని బట్టి సాంకేతికతను అంది పుచ్చుకోవాలని అన్నారు. చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. చేనేత రంగం కార్మికులకు సహాయం చేసేందుకు ప్రభుత్వం తెలంగాణ నేతన్న పొదుపు పథకం, తెలంగాణ నేతన్న భద్రత పథకం, తెలంగాణ నేతన్న భరోసా పథకం, తెలంగాణ నేతన్న రుణమాఫీ పథకం వంటి వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. చేనేత రంగం చెందిన వారికి శిక్షణ అందించి మరింత మెరుగైన ఆదాయం సంపాదించుకునేలా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చేనేత రంగం ఉందని, ఇది ఒక రకమైన కళ అని అన్నారు. చేనేత చీరలకు మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం చేనేత కార్మికులకు, నేతన్నలను, చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి శాలువాలతో సత్కరించి, మెమోంటోలు అందజేశారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు యం .విజయలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ కప్‌తో పాటు ఆ సిరీస్‌కూ రిషబ్ పంత్ దూరం?

ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్ ను 2-2తో ముగించిన టీమ్ఇండియా స్వదేశానికి చేరుకుంది. ఈ నెలలో భారత జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ లో ఎలాంటి సిరీస్ లు లేవు. సెప్టెంబరు 9న మొదలుకానున్న ఆసియా కప్ తో టీమ్ఇండియా మళ్లీ వరుస మ్యాచ్ లతో బిజీబిజీగా మారనుంది. టీ20 ఫార్మాట్ లో జరగనున్న ఆసియా కప్ కు మరో రెండు, మూడు వారాల్లో జట్టును ప్రకటించే అవకాశముంది. అయితే, ఇంగ్లాండ్ తో నాలుగో టెస్టులో బ్యాటింగ్ చేస్తూ గాయపడ్డ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ ఈ టోర్నీకి దూరమవడం ఖాయంగా కనిపిస్తోంది. అతనికి సర్జరీ అవసరం లేదని వైద్యులు చెప్పినట్లు సమాచారం. కానీ, పూర్తిస్థాయిలో కోలుకోవడానికి ఆరు వారాలు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. సెప్టెంబరు 28న జరిగే ఫైనల్ తో ఆసియా కప్ ముగియనుంది. అక్టోబర్ 2-14 మధ్య స్వదేశంలో వెస్టిండీస్ తో భారత్ రెండు టెస్టులు (అహ్మదాబాద్, ఢిల్లీలో) ఆడనుంది. ఈ సిరీస్ లో కూడా పంత్ బరిలోకి దిగేది అనుమానంగా కనిపిస్తోంది. పంత్ ఆడకపోతే ధ్రువ్ జురెల్ ప్రధాన వికెట్ కీపర్ గా ఉంటాడు. అక్టోబర్లోనే భారత జట్టు వన్డే, టీ20 సిరీస్ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఆసీస్ తో జరిగే మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్ తో పంత్ రీ ఎంట్రీ ఇచ్చే అవకాశముంది. ఇటీవల ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్ లో రిషబ్ అదరగొట్టాడు. నాలుగు మ్యాచ్ లు ఆడి రెండు సెంచరీలు, మూడు అర్ధ శతకాలతో 479 పరుగులు చేశాడు.

**ఆసియా కప్ లో భారత్ లీగ్ దశ మ్యాచ్ లు**

సెప్టెంబరు 10- యూఏఈతో (దుబాయ్)
సెప్టెంబరు 14- పాకిస్థాన్ తో (దుబాయ్)
సెప్టెంబరు 19- ఒమన్ తో (దుబాయ్)



# 750+ పరుగులు చేసినా 'టాప్ -10' నుంచి గిల్ ఔట్.. కారణమిదేనా?

ఇంగ్లాండ్ - భారత్ ఐదో టెస్టు ముగిసిన రెండు రోజులకే ఐసీసీ ర్యాంకులు వెలువడ్డాయి. బౌలింగ్, బ్యాటింగ్ లో ఇంగ్లాండ్ కంటే టీమ్ఇండియా ఆటగాళ్లే ఎక్కువ ఆధిపత్యం ప్రదర్శించారు. దీంతో ఐసీసీ ర్యాంకుల్లో ఆ ప్రభావం కనిపించినా.. ఒకేఒక్క ఆటగాడి విషయంలో ఇది తిరగబడటం గమనార్హం. అతడేమన్నా సరిగ్గా ఆడకుండా ఉన్నాడా? అంటే అదేం కాదు. ఈ సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ అతడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ నెగ్గిన ప్లేయర్. ఇప్పటికే అర్థమై ఉంటుందిగా అతడే కెప్టెన్ శుభ్ మన్ గిల్ . ఐసీసీ ర్యాంకుల్లో నాలుగు స్థానాలు దిగువకు పడిపోయాడు. సాధారణంగా బాగా ఆడితే ఆటోమేటిక్ గా ర్యాంక్ పెరగాలి కానీ.. ఇలా జరిగిందేంటా? అని అభిమానుల్లో సందేహం మొదలైంది. అయితే, దీనికి కారణం ఉందని తాజా కథనాలను బట్టి తెలుస్తోంది.

ఒకే సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన రెండో కెప్టెన్ గా శుభ మన్ గిల్ నిలిచాడు. ఇంగ్లాండ్ పై ఐదు టెస్టుల్లో 754 పరుగులు చేశాడు. క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్ మన్ (801) తర్వాత గిల్ దే రికార్డు. అయితే, ఐదో టెస్టుకు ముందు గిల్ ఐసీసీ ర్యాంకుల్లో 9వ స్థానంలో ఉన్నాడు. కానీ, చివరి మ్యాచులో అతడు కేవలం 32 పరుగులు మాత్రమే చేశాడు. ఇదే గిల్ ర్యాంక్ పై గట్టి దెబ్బ కొట్టింది. ఇందులో కనీసం హాఫ్ సెంచరీ చేసి ఉన్నా అతడి రేటింగ్ లో బాగా తేడా వచ్చేదే. మరోవైపు చివరి టెస్టులో సెంచరీ చేసిన యశస్వి జైస్వాల్ మూడు స్థానాలను మెరుగుపర్చుకోవడం గమనార్హం. గాయం కారణంగా దూరమైన రిషభ్ పంత్ ఒక స్థానం కిందికి పడిపోయాడు.

**అట్కిన్సన్, టంగ్ విషయంలో ఇలా..**

ఇంగ్లాండ్ - భారత్ మధ్య చివరి టెస్టులో ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన ప్రతి బౌలరూ ఐసీసీ ర్యాంకుల్లో



దూసుకురావడం విశేషం. ఇంగ్లాండ్ ఆటగాడు గస్ అట్కిన్సన్ కేవలం చివరి మ్యాచ్ లోనే ఆడాడు. అయితే, ఐదు వికెట్ల ప్రదర్శన చేయడంతోపాటు మొత్తం 8 వికెట్స్ తీశాడు. దీంతో రెండు స్థానాలు మెరుగై కెరీర్ లో తొలిసారి టాప్-10లోకి దూసుకొచ్చాడు. సిరీస్ ఆసాంతం అద్భుతంగా రాణించిన సిరాజ్ ఏకంగా 12 స్థానాలు దూసుకొచ్చి 15వ ర్యాంకులో నిలిచాడు. సిరాజ్ కూడా ఫైఫర్ తీశాడు. జోష్ టంగ్ కూడా చివరి మ్యాచ్ లో 8 వికెట్లు తీశాడు. ఇందులో '5' వికెట్ల ప్రదర్శనా ఉంది. దీంతో 14 స్థానాలు మెరుగుపర్చుకొని 46వ ర్యాంకులోకి వచ్చాడు. అతడు మూడు మ్యాచుల్లో 19 వికెట్లు తీసి ఇంగ్లాండ్ తరఫున టాప్ వికెట్ టేకర్ గా నిలిచాడు.

# చరిత్ర సృష్టించిన మాట్ హెన్రీ.. ఆల్ టైమ్ రికార్డు సమం

బులవాయో వేదికగా జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ స్టార్ పేసర్ మాట్ హెన్రీ నిప్పులు చెరిగాడు. అతడు బౌలింగ్ దాటికి పసికూన జింబాబ్వే విల్లవిల్లాడింది. తొలి ఇన్నింగ్స్ లో హెన్రీ 5 వికెట్లతో సత్తాచాటాడు. దీంతో మొదటి ఇన్నింగ్స్ లో ఆతిథ్య జింబాబ్వే కేవలం 125 పరుగులకే కుప్పకూలింది. కివీస్ బౌలర్లలో హెన్రీతో పాటు జకారీ ఫౌలక్స్ 4 వికెట్లతో అదరగొట్టాడు. ఇక జింబాబ్వే బ్యాటర్లలో మూడేళ్ల తర్వాత జట్టులో ఎంట్రీ ఇచ్చిన బ్రెండన్ టేలర్(44) టాప్ స్కోరర్ గా నిలవగా.. తిసాగా(33) రాణించారు. ఈ క్రమంలో మాట్ హెన్రీ ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.

జింబాబ్వేపై టెస్టుల్లో అత్యధిక సార్లు ఫైవ్ వికెట్ల హాల్ సాధించిన న్యూజిలాండ్ బౌలర్ గా క్రిస్ కెయిరన్స్ రికార్డును హెన్రీ సమం చేశాడు. కెయిరన్స్ తన కెరీర్ లో జింబాబ్వేపై 8 టెస్టులు ఆడి 39 వికెట్లు సాధించాడు. అందులో రెండు ఫైవ్ వికెట్ హాల్స్ ఉన్నాయి. మాట్ హెన్రీ కెరీర్ లో ఇప్పటివరకు కేవలం రెండు టెస్టులు మాత్రమే ఆడి 14 వికెట్లు పడగొట్టాడు. అందులో రెండు ఫైవ్ వికెట్ హాల్స్ ఉన్నాయి. కాగా తమ తొలి ఇన్నింగ్స్ ను ప్రారంభించిన న్యూజిలాండ్ నిలకడగా ఆడుతోంది. 32 ఓవర్లు ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 150 పరుగులు చేసింది. క్రీజులో విల్ యంగ్(69), కాన్వే(71) ఉన్నారు.



# మహేశ్‌కు నచ్చని కథ.. తీరా సినిమా సూపర్ హిట్టు!

మహేశ్బాబు కెరీర్ లో సూపర్ హిట్ చిత్రాల్లో మురారి ఒకటి. ఈ చిత్రంతోనే బాలీవుడ్ హీరోయిన్ సోనాలి బింద్రె తెలుగు తెరకు పరిచయమైంది. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందించాడు. 2001లో రిలీజైన ఈ చిత్రం గతేడాది మహేశ్ పుట్టినరోజు సందర్భంగా మరోసారి థియేటర్లలో విడుదలై సందడి చేసింది. రీరిలీజ్ సినిమా అయినప్పటికీ ఏకంగా రూ.9 కోట్లపైనే వసూళ్లు రాబట్టి రికార్డు సృష్టించింది.



ఈ మూవీలో మహేశ్ నటన, పాటలు అన్నీ అద్భుతంగా కుదిరాయి. తాజాగా ఓ వ్యక్తి మురారి సినిమాలోని 'చందమామ చందమామ కిందికి చూడమ్మా..' సాంగ్ క్లిప్ ను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఈ సినిమా కథ చెప్పినప్పుడు మహేశ్ రియాక్షన్ ఏంటి సర్? అని కృష్ణవంశీని అడిగాడు. అందుకు దర్శకుడు స్పందిస్తూ.. ఆయనకు నచ్చలేదు అని నవ్వుతున్న ఎమోజీలతో ఎక్స్ (ట్విటర్)లో రిప్లై ఇచ్చాడు.

ఇది చూసిన నెటిజన్లు.. తర్వాత ఏం జరిగింది సర్? ఆయన్ను ఎలా ఒప్పించారు? అసలేం జరిగిందో పూర్తిగా చెప్పొచ్చుగా అని ఆరా తీస్తున్నారు. మరికొందరేమో.. ఏముంది? మహేశ్ తండ్రి కృష్ణగారి దగ్గరకు వెళ్తే ఆయన కృష్ణవంశీకి కథపై ఉన్న నమ్మకం చూసి సినిమా చేయమని ఆదేశించినట్లున్నారు. మహేశ్ సరేనని తలాడించడంతో మురారి సినిమా పట్టాలెక్కింది అని ఊహిస్తూ కామెంట్లు చేస్తున్నారు.

# స్టైలిష్ మూమెంట్స్‌తో అదరగొట్టిన హృతిక్, తారక్

ప్రస్తుతం రాబోతున్న పలు అవైటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ అలాగే మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కలయికలో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన భారీ యాక్షన్ చిత్రం వార్ 2 కూడా ఒకటి. మరి ఈ సినిమాలో అవైటెడ్ సాంగ్ హృతిక్ వర్సెస్, ఎన్టీఆర్ నడుమ సాంగ్ కోసం ఎంతోమంది వెయిట్ చేశారు. మరి ఈ సాంగ్ తాలూకా ప్రోమో మేకర్స్ ఎట్టకేలకి వదిలారు. ఇక ఈ సాంగ్ లో మాత్రం ఇద్దరు హీరోలు మంచి స్మూత్ మూమెంట్స్ తో ఆకట్టుకున్నారని చెప్పాలి. స్టైలిష్ లుక్స్ లో మంచి గ్రేస్ తో చేసిన డాన్స్ మూమెంట్స్ బాగున్నాయి. ఇక సాంగ్ కూడా తెలుగు వెర్షన్ లో బాగుంది. మరి ఈ సాంగ్ ని మొత్తం థియేటర్స్ లోనే చూడాలని మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ చిత్రానికి ప్రీతమ్ సంగీతం అందించగా యష్ రాజ్ ఫిలమ్స్ వారు నిర్మాణం వహించారు.





# పెద్ద సౌత్ స్టార్ నాకు క్షమాపణలు చెప్పాడు

అన్ని భాషల్లో స్టార్ హీరోల సరసన నటిస్తూ సినిమాలు, వెబ్ సిరీస్ లతో అలరిస్తున్నారు నటి తమన్నా. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. చిన్న వయసులోనే ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో ఎన్నో ఇబ్బందులు పడినట్లు చెప్పారు. అసౌకర్యంగా ఉందని చెప్పినందుకు తన స్థానంలో మరో నటిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ''నేను చిన్న వయసులో ఇండస్ట్రీకి వచ్చాను కాబట్టి నాకేం తెలియదని అనుకునేవారు. నా విశ్వాసాన్ని దెబ్బతీయాలని చూశారు. ఇలా చాలాసార్లు జరిగింది. అవమానించడానికి ప్రయత్నించారు. పరిశ్రమకు వచ్చిన కొద్దికాలంలోనే ఓ పెద్ద సౌత్ స్టార్ సరసన నటించే అవకాశం వచ్చింది. ఆయనతో కొన్ని సన్నివేశాల్లో నటించేటప్పుడు అసౌకర్యంగా అనిపించింది. దర్శకనిర్మాతలకు నాకు ఇబ్బందిగా ఉందని, చేయలేనని చెప్పా. అప్పుడు ఆ అగ్రహీరో 'హీరోయిన్ ను మార్చండి' అని నాపై కేకలు వేశాడు. ఎవరైనా మనల్ని అవమానించారని బాధపడుతూ మనం కూడా తిరిగి వాళ్లతో అలా ప్రవర్తించకూడదని మౌనంగా ఉన్నాను. ఆయన మాత్రం ఆరోజు సెట్ లోనే అందరి ముందు పెద్దగా కేకలు వేశాడు. మరుసటిరోజు తనంతటతానే నా వద్దకువచ్చి క్షమాపణలు చెప్పాడు. తనకు కోపం వచ్చిందని అందుకే అరిచినట్లు తెలిపాడు. నాతో అలా ప్రవర్తించి ఉండకూడదని పశ్చాత్తాపపడ్డాడు'' అని తమన్నా తెలిపారు. అయితే, ఆ బిగ్ సౌత్ స్టార్ పేరు మాత్రం ఆమె చెప్పలేదు. 2005లో 'చాంద్ సా రోష్ చెహ్రా' అనే సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు తమన్నా. ఆ తర్వాత 'శ్రీ' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించారు. 'హ్యాపీడేస్'తో మంచి గుర్తింపు రావడంతో వరుస అవకాశాలు వచ్చాయి. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో అగ్రహీరోల సరసన నటించారు. తాజాగా 'రైడ్ 2'తో ఓ ప్రత్యేక పాటలో అలరించిన ఆమె ప్రస్తుతం నాలుగు హిందీ సినిమాల్లో నటిస్తున్నారు. ఇవన్నీ సెట్స్ పై ఉన్నాయి. తెలుగులో ఇటీవల 'ఓదెల 2'తో శివశక్తిగా మెప్పించారు. మరోవైపు తమన్నా తాజాగా చెప్పిన బ్యూటీ సీక్రెట్ నెట్టింట చర్చకు దారితీసింది. మొటిమలు తగ్గాలంటే సలైవా రాసుకోవాలని ఆమె సూచించారు. అందులో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. అవి మొటిమలతో పోరాడతాయని అయితే ఇది తన వ్యక్తిగత పర్సనల్ చిట్కా అని వెల్లడించారు. ఈ చిట్కాను పాటించొద్దంటూ పలువురు చర్మ వైద్యనిపుణులు సోషల్ మీడియాలో వీడియోలు చేయడంతో ఈ బ్యూటీ చిట్కా టాపిక్ గా మారింది.

# అకీరా కోసం వీరమల్లుకు సాయం!.. నిర్మాత ఏమన్నారంటే

పవన్ కల్యాణ్ కుమారుడు అకీరాను ఇండస్ట్రీకి పరిచయం చేయాలని అందరికీ ఉంటుందన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. ప్రస్తుతం ఆయన నిర్మిస్తున్న 'ది రాజాసాబ్' శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన 'హరిహర వీరమల్లు'కు సాయం చేయడంపై మాట్లాడారు. అకీరా సినిమా కోసమే సాయం చేయలేదని.. తనకు చేయాలని అనిపించింది కాబట్టి చేసినట్లు తెలిపారు.

''అకీరాను ఇండస్ట్రీకి పరిచయం చేయాలని నిర్మాతలందరికీ ఉంటుంది. నాకు కూడా అవకాశం వస్తే కచ్చితంగా తనతో సినిమా చేస్తాను. అయినా.. అకీరా ఎవరితో సినిమా చేయాలనేది సమయం తీసుకొని అతడే నిర్ణయించుకుంటాడు. ఈ విషయంలో ఎన్నో వార్తలు వస్తున్నాయి. దానికోసమే నేను 'హరిహర వీరమల్లు'కు సాయం చేయలేదు. నిర్మాత ఏఎం రత్నంకు అప్పుడు నా అవసరం ఉందనిపించి చేశానంతే. ఆ సమయంలో పవన్ నన్ను చూశారు. 'వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుకలో అందుకే థాంక్స్ చెప్పారు. అంతేకానీ, అకీరా సినిమా కోసమే పవన్ చిత్రానికి సాయం చేశాననేది అవాస్తవం'' అని స్పష్టతనిచ్చారు. తనకైతే పవన్, చిరంజీవి, అకీరా అందరి సినిమాలను నిర్మించాలని ఉందన్నారు.



ఇక 'ది రాజాసాబ్' గురించి మాట్లాడుతూ.. సెప్టెంబర్ లో ఈ సినిమా నుంచి ఎక్కువ అప్డేట్స్ వస్తాయని చెప్పారు. అక్టోబర్ నాటికి సినిమా అంతా పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుగుతోందన్నారు. డిసెంబర్ 5న విడుదల చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. కానీ, జనవరిలో రిలీజ్ చేయాలని చాలామంది కోరుతున్నారని.. త్వరలోనే దీనిపై తుదినిర్ణయం తెలుపుతామని చెప్పారు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో హారర్ కామెడీ నేపథ్యంలో ఇది రానున్న విషయం తెలిసిందే.



# ది రాజాసాబ్... రెండో భాగం ఉంది

ప్రభాస్ చిత్రమంటే రెండు భాగాలు పక్కా అనేది పరిపాటిగా మారిపోయింది. ఇప్పటికే ఆయన 'కల్కి 2', 'సలార్ 2' సినిమాలు చేయాల్సి ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'ది రాజాసాబ్'కి కూడా రెండో భాగమున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. తాజాగా దీనిపై చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ స్పష్టత ఇచ్చారు. 'రాజాసాబ్ 2' ఉంటుందని.. కాకపోతే ఇది తొలి భాగానికి కొనసాగింపులా ఉండదని.. థీమ్, సెటప్ ఒకే తరహాలో ఉంటాయని విశ్వప్రసాద్ చెప్పారు. అనంతరం విడుదల తేదీ విషయమై స్పందిస్తూ.. ప్రభాస్ అభిమానులు, తెలుగు మార్కెట్ వర్గాలు ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 9న తీసుకు రావాలని కోరుతున్నారని.. హిందీ ప్రేక్షకులు మాత్రం డిసెంబరు 5న విడుదల చేయాలని కోరుతున్నారని చెప్పారు. ఏదేమైనా తాము అనుకున్న తేదీకే సినిమాని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. అక్టోబరు నాటికి మొత్తం చిత్రీకరణ పూర్తి కానుందని విశ్వప్రసాద్ తెలియజేశారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా.. సంజయ్ దత్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.